

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 21-08-2022 సంపుటి : 04 సంచిక : 05 పేజీలు : 4 వెల : రూ 3-00


## నాగార్జున యూనివర్శిటీ స్నాతకోత్సవం..

### సీజేఐ రమణకు గౌరవ డాక్టరేట్ ప్రదానం



గుంటూరు జిల్లా : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 37, 38 స్నాతకోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఎన్వీ రమణకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. వర్శిటీ ఛాన్సలర్ హోదాలో గవర్నర్ బిశ్వభూషణ్, వైస్ చాన్సలర్ రాజశేఖర్‌తో పాటు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. సీజేఐ ఎన్వీ రమణ ఈ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి కావడం విశేషం. ఈ సందర్భంగా పలు విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలతోపాటు పట్టాలను బహూకరించారు. ఈ సందర్భంగా సీజేఐ ఎన్వీ రమణ మాట్లాడుతూ ఈ విశ్వవిద్యాలయంలో చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు. తాను చదువుకున్న యూనివర్శిటీ నుంచే గౌరవ డాక్టరేట్ పొందడం అనిర్వచనీయమైన అనుభూతిని పొందుతున్నానన్నారు. ఇక్కడి క్యాంటీన్ తమ అడ్డా అని, ఇక్కడ కూర్చుని ఎన్నో విషయాలపై చర్చించేవారమన్నారు. అలాంటి చర్చలు ఇప్పుడు జరగడం లేదని విచారం వ్యక్తం చేశారు. సమస్యలపై యువత స్పందించాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా తయారుకావాలని సూచించారు. గత 40 ఏండ్లుగా నాగార్జున విశ్వవిద్యాలయం విద్యా రంగానికి అందిస్తున్న సేవలు అమోఘమైనవని ప్రశంసించారు. హోలిస్టిక్ విద్యా విధానం అమలవుతేనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. సమాజం కోసం, సమాజం అవసరాల కోసం ఉత్తమ పౌరుల్ని తయారుచేసేలా విద్యా విధానం ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. పరిశోధనలకు పెద్ద పీఠ వేయాలని, అందుకు తగినట్లుగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. యూనివర్శిటీకి అవసరమైన నిధులు అందించేలా మంత్రి బొత్స చొరవ తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంతోషంగా ఉంది.. ఇది అందరికీ గుర్తుండిపోయే ఘట్టం



సీజేఐ ఎన్వీ రమణ, సీఎం జగన్



విజయవాడ: ఈ గడ్డ మీద పుట్టిన బిడ్డ (సీజేఐ ఎన్వీ రమణను ఉద్దేశించి).. ఇవాళ ఒక ఉన్నతస్థాయిలో ఇక్కడి కోర్టు భవనాన్ని ప్రారంభించడం.. రాష్ట్రంలో ఎప్పటికీ గుర్తుండిపోతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సిటీ సివిల్ కోర్టు కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం జగన్ ప్రసంగించారు. 2013లో జస్టిస్ ఎన్వీ రమణగారి చేతుల మీదుగానే ఈ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన జరిగిందని, మళ్లీ ఆయన చేతుల మీదుగా ప్రారంభం కావడం విశేషం. ఇది అందరికీ గుర్తుండిపోయే ఘట్టం అని సీఎం జగన్ తెలిపారు. జ్యూడీషియరీకి సంబంధించి ప్రతీ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాల సహకరిస్తుందని సీఎం జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగారు తెలుగులో మాట్లాడాక.. తాను తెలుగులో మాట్లాడకపోవడం బాగోదని చెప్తూ తెలుగులోనే ప్రసంగించారు జస్టిస్ ఎన్వీ రమణ. నేను శంకుస్థాపన చేసిన బిల్డింగ్‌ను.. మళ్లీ నేనే ప్రారంభించడం ఆనందంగా ఉంది. రకరకాల కారణాలతో ఈ నిర్మాణం ఆలస్యమైంది. న్యాయ వ్యవస్థకు అదనపు నిధుల విషయంలో కేంద్రం నుంచి వ్యతిరేక వచ్చినప్పుడు మద్దతు ఇచ్చిన ముఖ్యమంత్రులకు( ఏపీ సీఎం జగన్ కూడా) కృతజ్ఞతలు. పెండింగ్ కేసులు విషయంలో సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలనే తపన న్యాయమూర్తులకు, న్యాయవాదులకు ఉండాలని జస్టిస్ ఎన్వీ రమణ ఆకాంక్షించారు. విభజన అనంతరం ఏపీ ఆర్థికంగా వెనకబడిందన్న సీజేఐ.. విభజనతో నష్టపోయామన్న భావన ఏపీ ప్రజల్లో ఉందని, కాబట్టి ఈ విషయంలో కేంద్రం రాష్ట్రానికి తోడ్పాటు అందించాలని కోరారు. నేను రెండు తెలుగు రాష్ట్రాల్లో జడ్జిల ఖాళీలను భర్తీ చేసాను. 250 మంది హైకోర్టు జడ్జి లను, 11 మంది సుప్రీంకోర్టు జడ్జి లను నియమించగలిగాను. సీఎం వై ఎస్ జగన్ సహకారం వల్లనే ఇప్పుడు ఈ భవనం పూర్తి చేసుకోగలిగాం. విశాఖపట్నం లో కూడా ఓ భవనం చివరి దశలో ఉంది. దానితో పాటు ఇతర కోర్టు భవనాలను కూడా పూర్తి చేయాలని సీఎం జగన్‌ను కోరుతున్నాం అని జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు.

## ఏపీ ప్రభుత్వం తరపున సీజేఐ ఎన్వీ రమణకు విందు



విజయవాడ: మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ల గౌరవార్థం రాష్ట్ర ప్రభుత్వం అధికారిక విందు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఈ విందులో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, హైకోర్టు సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

## గుంటూరు వైసీపీలో విబేధాలు.. సుచరితపై ఎమ్మెల్యే శ్రీదేవి ఆగ్రహం

గుంటూరు జిల్లా: వైసీపీలో నాయకుల మధ్య విబేధాలు మరోసారి బయటపడ్డాయి. మాజీ మంత్రి, గుంటూరు జిల్లా ఇంఛార్జీగా ఉన్న మేకతోటి సుచరితపై తాడికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ఆగ్రహంతో ఊగిపోయారు. సుచిరితపై తీవ్ర పదజాలంతో దూషించారు. ఆమె నివాసం వద్ద అర్ధరాత్రి ధర్నాకు దిగారు. కాంగ్రెస్‌నే వీడి కొంత కాలం క్రితం వైసీపీలో చేరిన డొక్కా మాణిక్యవరప్రసాద్ నియామకమే దీనికంతటికీ ప్రధాన కారణంగా పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. గుంటూరు జిల్లాలో వైసీపీ నేతల మధ్య విబేధాలు రచ్చకెక్కాయి.



మాజీ మంత్రి మేకతోటి సుచరితపై తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కారాలు మిరియాలు నూరుతున్నారు. తనకు మాట మాత్రమైనా చెప్పకుండా పదవులు కట్టబెట్టడంపై ఆమె ఆగ్రహంతో ఉన్నారు. సుచరిత నిర్ణయంపై వైసీపీ అగ్రనాయకులకు సైతం ఫిర్యాదు చేసిన శ్రీదేవి.. శుక్రవారం అర్ధరాత్రి సుచరిత ఇంటికి చేరుకుని బైఠాయించింది. సుచరిత విధానాన్ని నిరసిస్తూ ధర్నాకు దిగింది. తాడికొండ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న తనకు తెలియకుండానే అదనపు ఇంఛార్జీని నియమించడంపై ఆమె అగ్రహోదగ్రులవుతున్నారు. నియోజకవర్గం అదనపు ఇంఛార్జీగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను నియమించడం తనను అవమానించడమే అని ఆరోపించారు. తన ఇంటి వద్ద ధర్నాకు దిగిన శ్రీదేవిని నిరసన విరమించాలని సుచరిత కోరింది. ఈ విషయంపై పార్టీ హైకమాండ్‌తో మాట్లాడతానని శ్రీదేవికి నచ్చజెప్పింది. దాంతో ఎమ్మెల్యే శ్రీదేవి తన నిరసనను విరమించారు. ఎమ్మెల్యే శ్రీదేవికి తాడికొండకు చెందిన నేతలు అండగా నిలిచారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ నియామకంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ హైకమాండ్‌తో చర్చించేందుకు ప్రయత్నిస్తున్నారు. 10 గంటల్లోగా పార్టీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే రాజీనామా చేస్తామని నాలుగు మండలాల నేతలు ప్రకటించారు.

## మనాలిలో చిక్కుకుపోయిన విశాఖ కార్పొరేటర్లు

విశాఖపట్నం : అధ్యయన యాత్రకు వెళ్లిన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు మనాలిలో చిక్కుకుపోయారు. మనాలి నుంచి చండీగఢ్ వెళ్లే మార్గంలో లారీపై బండరాళ్లు పడటంతో లారీ బోల్తా పడింది. దాంతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫలితంగా విశాఖకు చెందిన 95 మంది కార్పొరేటర్ల బృందం మనాలిలోనే ఉండిపోవాల్సి వచ్చింది. అందరూ క్షేమంగా ఉన్నారని తెలుస్తున్నది. మనాలి–చండీగఢ్ రహదారిలో జోరుగా కురుస్తున్న వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ మార్గంలో వెళ్తున్న ఓ లారీపై పెద్దపెద్ద రాళ్లు పడటంతో లారీ బోల్తాపడింది. దాంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఫలితంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ సమస్య తలెత్తింది. వాన జోరుగా కురుస్తుండటం, రోడ్డు ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో మనాలి వద్ద కార్పొరేటర్ల పర్యటన నిలిచిపోయింది. కార్పొరేటర్లు ప్రయాణిస్తున్న ప్రాంతానికి సమీపంలోనే ఈ ఘటన చోటుచేసుకున్నది. చండీగఢ్ బయల్దేరేందుకు బస్సులో బయల్దేరిన విశాఖ కార్పొరేటర్లు రాత్రంతా బస్సులోనే జాగారం చేశారు. మహిళా కార్పొరేటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అయితే కార్పొరేటర్లందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందింది. విశాఖ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 10 గంటల తర్వాత ఈ రహదారిని క్లియర్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ బృందం తదుపరి చండీగఢ్‌కు బయల్దేరుతుంది. ఉత్తర ఆంధ్రలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్‌లకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ అధ్యయన పర్యటనలో ఉన్నారు. ఈ నెల 23న వీరంతా వైజాగ్‌కు తిరిగి రానున్నారు. కార్పొరేటర్లు అంతా క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందడంతో వారి కుటుంబసభ్యులు, మద్దతుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





## భారీ వర్షాలకు కూలిన చక్కి రైల్వే బ్రిడ్జ్..

### హిమాచల్ ప్రదేశ్‌లో 14 మంది మృతి

షిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కంగ్రా జిల్లాలో ఉన్న చక్కి రైల్వే బ్రిడ్జ్ ఇవాళ కూలింది. శనివారం ఆ బ్రిడ్జ్ కూలినట్లు జిల్లా మెజిస్ట్రేట్ రోహిత్ రాథోడ్ తెలిపారు. మండి జిల్లాలో కూడా ఇవాళ ఉదయం అకస్మాత్తుగా భారీ వర్షం, వరద వచ్చింది. అయితే కొండచరియలు విరిగిపడిన ఘటనలో 14 మంది మృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు. చంబా జిల్లాలో వర్షాల వల్ల కొండచరియలు విరిగి ఓ ఇంటిపై పడ్డాయి. ఆ ఘటనలో ముగ్గురు మరణించారు. మండి జిల్లాలోని బాగీ నుల్లాలో ఓ అమ్మాయి మృతదేహాన్ని ఇంటికి అరకిలోమీటరు దూరంలో గుర్తించారు. ఆ అమ్మాయి కుటుంబానికి చెందిన అయిదుగురు వరదల్లో కొట్టుకుపోయినట్లు డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ అధికారులు తెలిపారు. క్లౌడ్‌బస్ట్ కావడంతో బాగీ నుంచి ఓల్డ్ కటోలా ప్రాంతంలో ఉన్న ఇండ్లకు చెందిన కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడడం వల్ల మండి జిల్లాలో రోడ్లన్నీ బ్లాక్ అయ్యాయి.



## ఎక్సైజ్ పాలసీ రగడ। కేజ్రీవాల్‌ను టార్గెట్ చేస్తున్న మోదీ : ఆప్




న్యూఢిల్లీ : మద్యం పాలసీ కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాపై సీబీఐ దాడుల నేపథ్యంలో ఆప్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను నెంబర్ వన్ టార్గెట్‌గా ఎంచుకన్నారని ఆప్ ప్రతనిధి సౌరవ్ భరద్వాజ్ ఆరోపించారు. 31 ప్రదేశాల్లో సీబీఐ చేపట్టిన విస్తృత దాడుల్లో ఏం స్వాధీనం చేసుకున్నారో సీబీఐ వెల్లడించాలని డిమాండ్ చేశారు. 900 మంది ఐటీ సిబ్బంది దాడుల్లో పాల్గొని ఏం నిగ్గుతేల్చారో తెలపాలని కోరారు. గతంలో సీబీఐని దుర్వినియోగం చేస్తున్నారని పాత వీడియోల్లో వాపోయిన మోదీ ఇప్పుడు విపక్షాలపై ప్రయోగిస్తూ ప్రతిపక్షాలను వీలైనంత ఇబ్బంది పెట్టాలని దర్యాప్తు ఏజెన్సీలను ప్రేరేపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్ర నేతల నుంచి సీబీఐపై తీవ్ర ఒత్తిడి ఉందని ఆరోపించారు. మరోవైపు మనీష్ సిసోడియా మద్యం పాలసీ కేసులో నెంబర్ వన్ నిందితుడే అయినా ఈ స్కాం వెనుక ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రధాన సూత్రధారిగా ఉన్నారని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. కేజ్రీవాల్ మీడియా ముందుకు వచ్చి 24 గంటల్లోగా తనకు జవాబివ్వాలని అనురాగ్ ఠాకూర్ సవాల్ విసిరారు. విలేకరుల సమావేశానికి హాజరైన మనీష్ సిసోడియాకు ముఖం చెల్లలేదని, ఆయన ఏ ప్రశ్నకూ బదులివ్వలేదని అన్నారు. మనీష్ సిసోడియాకు కేవలం మనీ వ్యామోహంతో డబ్బు తీసుకుని మౌనంగా ఉంటున్నాడని ఎద్దేవా చేశారు. మరోవైపు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్, మోదీ మధ్యే పోటీ ఉంటుందని సిసోడియా చేసిన వ్యాఖ్యలను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తప్పుపట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కేజ్రీవాల్ విపక్షాల అభ్యర్థిగా ముందుకొస్తే తమ పని మరింత సులువవుతుందని అన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 21-08-2022

## జమిలి ఎన్నికలే తరుణోపాయమా

ఒక దేశం, ఒక ఎన్నిక, ఒక ప్రధాని' అని కేంద్రంలోని అధికార బీజేపీ గత కొంతకాలంగా నినదిస్తూనే ఉంది. వీలు చిక్కినప్పుడల్లా లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విషయమై లా కమిషన్‌ను గిల్లుతూనే ఉంది. తరచూ ఎన్నికల వల్ల పడే ఖజానా భారాన్ని తప్పించడానికీ, జన జీవితానికి విఘాతం కలగకుండా చూడటానికీ జమిలి ఎన్నికలే తరుణోపాయం అని చెబుతోంది. తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పాలనా పరిస్థితులు అస్తుబిస్తుగా ఉండటం కూడా దీనికి ఒక ప్రధాన కారణం. ఈ తరహా ఎన్నికల నిర్వహణ ద్వారా ఏకపక్ష పాలనకూ, ఏక వ్యక్తి నియంతృత్వ పోకడలకూ ప్రయత్నిస్తోందనే అనుమానాలు బలంగానే ఉన్నాయి.నిర్ణీత తేదీ రాకముందే 2024లో జరగాల్సిన ఎన్నికలు జరుగుతాయా? ఈ నడమంత్రపు ఎన్నికల కోసం బీజేపీ?ఆరెస్సెస్ పాలకులు తహతహలాడటం ఇవాళ అర్ధంతరంగా పుట్టిన 'పుందు' కాదు. 2014లో ప్రధానమంత్రి పదవిని నరేంద్ర మోదీ చేపట్టిన రోజు నుంచీ 'ఒక దేశం, ఒక ఎన్నిక, ఒక ప్రధాని' నినాదం కొనసాగుతూనే ఉంది. గత ఎనిమిదేళ్లుగా తనకు వీలు చిక్కినప్పుడల్లా లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విషయమై కేంద్ర 'లా కమిషన్'ను పదేపదే గిల్లుతూ వచ్చారు మోదీ. అదే విషయాన్ని బీజేపీ న్యాయ శాఖామంత్రి కిరెన్ రిజిజూ లోక్‌సభలో ప్రకటిస్తూ, జమిలి ఎన్నికలు జరిపే అంశాన్ని పార్లమెంటరీ కమిటీ అధ్యయనం చేస్తోందని చెప్పారు. ఇందుకు 'కారణాల'ను పేర్కొంటూ, తరచూ ఎన్నికల వల్ల సాధారణ జన జీవితానికి విఘాతం కలుగుతోందనీ, ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించి పోతున్నాయనీ అన్నారు. వీటికితోడు ఖజానాపై భారం పడుతోంది కాబట్టి, జమిలి ఎన్నికలు నిర్వహించడం అవసరమని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి చెప్పారు. అయితే దీనికి ప్రతిపక్షాలు స్పందిస్తూ, 'ధరల పెరుగుదలపైనా, జీఎస్టీ రూపంలో రాష్ట్రాలపై పడుతున్న దుర్భర భారం పైనా' ముందు చర్చ జరగాలని కోరాయి. బీజేపీ పాలకుల కోర్కె పైనే 21వ లా కమిషన్ తన ముసాయిదా నివేదికలో ఉప్పు అందిస్తూ, ఈ 'చిట్కా'తో దేశం 'తరచూ ఎన్నికల బెడద' నుంచి విముక్తి అవు తుందని వత్తాసు పలికింది. ఇందుకు అనుగుణంగానే 22వ లా కమిషన్‌ను 'ఏర్పాటు' చేసిన పాలకులు ? కమిషన్‌ను అధ్యక్షుడు, ఇతర సభ్యులు లేకుండానే వదిలేసింది. ఫలితంగా కమిషన్ పదవీ కాలం మూడేళ్లూ గడిచిపోనుండటం పాలకుల దురుద్దేశానికి నిదర్శనం.'జమిలి' ఎన్నికల ఎత్తుగడ వెనక బీజేపీ పాలనలో ఒక్కొక్కటిగా జారిపోతున్న ప్రజాస్వామిక విలువలు ఉన్నాయని మరచిపోరాదు. విచిత్రమేమంటే, మోదీ కేంద్ర మంత్రివర్గంలోని మంత్రులలో కనీసం 42 శాతం మంది తమపైన క్రిమినల్ కేసులున్నాయని బాహాటంగా ప్రకటించుకున్నారు. అయినా కొలది రోజులనాడు జరిగిన నూతన రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా క్రిమినల్ కేసులతో మసకబారి పోయిన ఎంపీలు, ఎమ్మెల్యేలు వేసే ఓట్లు చెల్లనేరవని ప్రకటించే అధికారం తనకు ఉన్నా కూడా ఉన్నత న్యాయస్థానం గొంతు విప్పలేకపోయింది.500 పైచిలుకు పార్లమెంట్ సభ్యులలో 250 మందికి పైగా అవినీతి పరులు ఉన్నారని, సాధికారికంగా రుజువులతో లెక్కదీసి దేశ ప్రజల ముందుంచిన అత్యున్నత విచారణ సంస్థల నివేదికలను ఇంతవరకూ కాదనగల ధైర్యం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకత్వానికి లేదు. ఇలాంటి సర్వవ్యాపిత పతన దశల్లో ఉన్న రాజ్యాంగ వ్యవస్థల నీడలో 2014లో ఢిల్లీ పీఠం ఎక్కిన మోదీ ప్రభుత్వం వచ్చీరావడంతోనే ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీఏ)లో, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎలాంటి నేరానికి పాల్పడ్డా, చార్జిషీట్ అతనిపై నమోదై ఉన్నా ఏడేళ్లకు తక్కువ గాకుండా ఖైదు శిక్ష విధించాలన్న బిల్లును పక్కకు పెట్టేసింది. బీజేపీ 'జమిలి' ఎన్నికలకు అనుసరించబోతున్న వ్యూహానికి ఇది పక్కా నిదర్శనం.నేరస్థులైన రాజకీయవేత్తలు తమపై ఆరోపణలు రుజువయ్యే దాకా లేదా విడుదలయ్యేదాకా ఎన్నికల్లో పాల్గొనడానికి అర్హులు కారని తొలి చట్టం నిర్దేశించింది. ఈ చట్ట నిబంధనలున్న ముసాయిదా బిల్లును కాస్తా మోదీ ప్రభుత్వం పక్కకు నెట్టేయడం రానున్న జమిలి ఎన్నికల ద్వారా ఏకపక్ష పాలనకు, ఏక వ్యక్తి నియంతృత్వ పోకడలకు తాతాచార్యుల ముద్ర వేయడంగానే భావించాలి. అంతకుముందు, స్వాతంత్ర్యం తర్వాత తొలి పాతిక ముప్పయ్యేళ్ల దాకా పళ్ల బిగువుతో కాపాడుకుంటూ వచ్చిన రాజ్యాంగ నిర్దేశాలు, ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనలు క్రమంగా 'దుల్లి'పోతూ వచ్చాయి. అయినా బీజేపీ పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో బీజేపీ ఎమ్మెల్యేలపై నమోదైన అనేక కేసులను స్వచ్ఛంద సంస్థ ? ఏడీఆర్ (అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్) పదేపదే దేశ ప్రజల దృష్టికి తెస్తూనే ఉంది. మసకబారి ఎన్నికైన సభ్యుల సంఖ్య 2007 నుంచీ మరీ రెట్టింపు అవుతోందని 2014 నుంచీ సుప్రీంకోర్టు కూడా మొత్తుకుంటూనే ఉంది. గిరిజనుల నుంచి రాష్ట్రపతిగా ఎన్నికైన ద్రౌపదీ ముర్మూ కూడా ఈ విషయాలన్నీ గమనించాలి. పాలకులకు రబ్బరు స్టాంపుగా మారకూడదు. దేశ జనాభాలో 2011 జనగణన ప్రకారం, 10 కోట్ల 40 లక్షలమంది ఆదివాసీ ప్రజలు (8.6 శాతం మంది) ఉన్నారని మరచిపోరాదు. అంతేగాదు, ఏడు రాష్ట్రాలలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారు 2020లో కూడా వేధింపులకు గురి కావలసి వచ్చిందని జాతీయ స్థాయిలో నేరాలు నమోదు చేసిన తాజా నివేదిక వెల్లడించింది. అందుకే సమత సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, గనులు, ఖనిజాలు, ప్రజారక్షణ సంస్థ అధ్యక్షుడు రవి రెబ్బాప్రగడ... రాష్ట్ర పతిగా ద్రౌపదీ ముర్మూ షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాలను మరింతగా కాపాడాల్సిన అవసరాన్ని మరీమరీ గుర్తు చేస్తున్నారు. దళిత వర్గం నుంచి వచ్చిన రామ్‌నాథ్ కోవింద్‌ను కూడా ఆ పదవిలోకి వచ్చేట్టు చేయగలిగింది భారతీయ జనతా పార్టీయే. అయినా దళితుల బతు కులు ఇసుమంత కూడా మెరుగు పడకపోగా, బీజేపీ ఎన్నికల ప్రయోజనాల కోసమే పావు చెక్క గా వినియోగపడక తప్పలేదు. జమిలి ఎన్నికల ప్రతిపాదనపై కొంతకాలంగా బీజేపీ పట్టు పట్టడానికి ? మహారాష్ట్ర ఎన్నికల తర్వాత కర్ణాటక సహా పలు బీజేపీ రాష్ట్రాలలో పాలనా పరిస్థితులు అస్తుబిస్తుగా ఉండటం కూడా ఒక ప్రధాన కారణం. ఈ సందర్భంగా భారతదేశ ప్రసిద్ధ జాతీయ పక్షపత్రిక ఫ్రంట్ లైన్ తాజా సంచిక మహారాష్ట్ర పరిణామాలపై వ్యంగ్య చిత్రం ప్రచురించింది. మహారాష్ట్ర తర్వాత ప్రభుత్వాల్ని పడగొట్టే బీజేపీ తర్వాత పడగొట్టే రాష్ట్రమేది? అని ఆ చిత్రం ప్రశ్నించింది. ఈ సర్కస్ నడుపుతున్న వారిలో మోదీతో పాటు హోంమంత్రి అమిత్ షా మరోవైపు నుంచి కమ్చీ ఝుళిపిస్తూ ఇకమీదట ఉండేది 'ఒకే భారత్, అదే బీజేపీ భారత్' అని ముక్తాయింపు విసురుతాడు.

# అనకాపల్లిలో వర్గ పోరు

విశాఖపట్టణం, ఆగస్టు 20, ఆయన లక్కీయెస్ట్ పొలిటీషియన్ అని చెప్పుకోవాలేమో. ఎందుకంటే ఆయన ప్రాంతం అది కాదు, ఆయనకు రాజకీయంగా కూడా అక్కడ పెద్దగా పట్టులేదు. తండ్రి మహలక్ష్మినాయుడు రాజకీయాల్లో ఉన్నా ఏనాడూ ఎమ్మెల్యే అయింది లేదు. అయినా ఆయన వారసుడిగా టీడీపీలో కొనసాగుతూ పీలా గోవింద సత్యనారాయణ 2014 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి ఎమ్మెల్యే అయిపోయారు. నిజానికి ఆయనది పెందుర్తి ప్రాంతం. అనకాపల్లికి చాలా దూరంగా ఆయన నివాసం ఉంటుంది. అలా కనుక చూసుకుంటే ఆయన వలస వచ్చిన నేత. అంతే కాదు రాజకీయం కలసి వచ్చిన నేత కూడా. ఇక అయిదేళ్ళ పాటు పీలా గోవింద సత్యనారాయణ అనకాపల్లి రాజకీయాల్లో చక్రం తిప్పేశారు. ఆయన తరఫున కుమారుడు కూడా డీఫ్యాక్టో ఎమ్మెల్యేగా ఏకంగా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు.మరో వైపు భూ దందాల విషయంలో కూడా పీలా గోవింద సత్యనారాయణ మీద విమర్శలు రావడం, ప్రజలతో పెద్దగా కలవకపోవడం, అనకాపల్లిలో వర్గ పోరు వంటివన్నీ తోడు అయి ఆయనను 2019 ఎన్నికల్లో ఓడించాయి. పీలా గోవింద సత్యనారాయణ కు 2019 ఎన్నికల్లో టికెట్ ఇవ్వకూడదని ఒక దశలో చంద్రబాబు భావించారని చెబుతారు. అయితే పీలా పలుకుబడి ఉపయోగించుకుని టికెట్ సంపాదించుకున్నారు. ఆయన ఓడిపోతారని పార్టీ నేతలే ఎన్నికలకు ముందు ప్రచారం చేశారు. చివరకు అదే నిజం అయ్యింది. ఎన్నికల్లో ఓడిపోయాక ఆయన నియోజకవర్గంలో పార్టీని అనాథలా వదిలేశారు.పీలా గోవింద సత్యనారాయణ పై ఇప్పటకీ కూడా టీడీపీ కేడర్లో వ్యతిరేకత ఉన్నా కూడా ఆయన తనకే మళ్లీ టికెట్ అని నమ్ముతున్నారు. కానీ చంద్రబాబు మాత్రం ఈసారి క్యాండిడేట్ ని మారుస్తారు అంటున్నారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్సీగా ఉన్న బుద్ధా నాగ జగదీశ్వరరావుకు 2024 ఎన్నికల్లో టికెట్ ఖాయమని చెబుతున్నారు. చంద్రబాబు, లోకేష్ లకు అత్యంత ఆప్తుడుగా ఉన్న బుద్ధాకు ఈ మేరకు గట్టి హామీ లభించింది అంటున్నారు. ఆయన 2014 ఎన్నికలకు ముందు వరకు ఆయనే పార్టీ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అయితే బాబు సూచన మేరకు ఆయన టిక్కెట్ త్యాగం చేయడంతోనే పీలా గోవింద సత్యనారాయణ కు అప్పుడు టిక్కెట్ వచ్చింది.పీలా గోవింద సత్యనారాయణ కన్నా ఆయనే నియోజకవర్గంలో చురుకుగా ఉంటున్నారు. ఒక వేళ పీలా గోవింద సత్యనారాయణ కు కనుక టికెట్ దక్కకపోతే ఆయన రాజకీయ జీవితం వన్ టైమ్ ఎమ్మెల్యేగానే మిగిలిపోతుందని అంటున్నారు. ఏది ఏమైనా కూడా పీలా గోవింద సత్యనారాయణ ను అభ్యర్థిగా పెడితే అవతల వైపు క్యాండిడేట్ సులువుగా గెలుస్తారు అన్న ప్రచారం అయితే ఉంది. దాంతో టీడీపీ కోరి మరీ అనకాపల్లి లాంటి సీటు వదులుకోదు అంటున్నారు.

# వైసీపీ ఆపరేషన్ మంగళగిరి



గుంటూరు, ఆగస్టు 20, వైసీపీ అధినేత వైఎస్ జగన్ టీడీపీలో ఆపరేషన్ ప్రారంభించినట్లే కనపడుతుంది. పార్టీ కీలక నేతలను టీడీపీకి దూరం చే?సే ప్రక్రియ మొదలుపెట్టారు. తొలుత మంగళగిరిలో మెయిన్ వికెట్ ను పడగొట్టేశారు. వచ్చే ఎన్నికల్లోనూ నారా లోకేష్ ను ఓడించడమే జగన్ టాస్క్ గా పెట్టుకున్నట్లు కనపడుతుంది. ఒకవైపు కుప్పంపై ఫోకస్ పెడుతూనే మరో వైపు చంద్రబాబు తనయుడు లోకేష్ పోటీ చేయనున్న మంగళగిరి నియోజకవర్గంపై కూడా దృష్టి పెట్టారు. తాజాగా టీడీపీ నుంచి గంజి చిరంజీవి పార్టీ నుంచి బయటకు రావడమే ఇందుకు కారణమని చెప్పక తప్పదు. కుప్పంలో స్థానిక సంస్థలన్నింటిలో విజయం సాధించేలా చేసి చంద్రబాబును అటు వైపునకు పరుగులు తీయించారు ఇప్పుడు నారా లోకేష్ వంతయింది. ఎప్పటి నుంచో మంగళగిరిపై జగన్ ఫోకస్ పెట్టారు. రాజధాని అమరావతికి దగ్గరగా ఉన్న నియోజకవర్గం కావడంతో ఆయన కళ్లన్నీ దానిపైనే ఉన్నట్లు కనపడుతుంది. మంగళగిరి టౌన్ లో యాభై వేల మంది వరకూ పద్మశాలీ సామాజికవర్గానికి చెందిన ఓటర్లున్నారు. వీరు ఎటువైపు మొగ్గు చూపితే వారిదే విజయం అవుతుంది. తాడేపల్లి మండలంలో రెడ్డి సామాజికవర్గం ఎక్కువ. పద్మశాలిలను తమ వైపునకు తిప్పుకుంటే మరోసారి లోకేష్ ను సులువుగా ఓడించవచ్చన్న వ్యూహంలో జగన్ ఉన్నారు.పద్మశాలి నేత చిల్లపల్లి మోహన్ రావుకు ఆప్కో ఛైర్మన్ పదవి జగన్ ఇచ్చారు. ఇక అదే సామాజికవర్గానికి చెందిన మురుగుడు హన్మంతరావుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఇది అప్పట్లో ఎవరూ ఊహించను కూడా లేదు. చేనేత సామాజికవర్గానికి చెందిన మురుగుడు హన్మంతరావుకు పదవి ఇవ్వడంతో కొంత పద్మశాలిలను జగన్ తన వైపునకు తిప్పుకున్నారు. ఇక తాజాగా గంజి చిరంజీవి టీడీపీకి రాజీనామా చేశారు. ఆయన ఏ పార్టీలో చేరతారన్నది సస్పెన్స్ అయినా చివరకు వైసీపీ తీర్థం పుచ్చుకుంటున్నారన్న టాక్ నడుస్తుంది. ... వచ్చే ఎన్నికల్లో ఆళ్ల రామకృష్ణారెడ్డి పోటీ చేయడం కష్టమే. ఆయన గత ఎన్నికలలోనే తాను పోటీ చేయనని జగన్ కు నేరుగా చెప్పారు. చివరి నిమిషంలో ఆళ్ల మనసు మార్చుకుని బరిలోకి దిగారు. 2014 ఎన్నికలలో ఆళ్ల రామకృష్ణారెడ్డిపైన టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గంజి చిరంజీవి కేవలం 14 ఓట్లతోనే ఓటమి పాలయ్యారు. ఆయనను పార్టీలోకి తీసుకుంటే వచ్చే ఎన్నికల్లో ఆళ్ల పోటీకి సుముఖత వ్యక్తం చేయకపోయినా గంజి చిరంజీవి స్ట్రాంగ్ కాండిడేట్ వైసీపీకి అవుతారు. అందుకే గంజి చిరంజీవిని త్వరలోనే వైసీపీలో చేర్చుకుని ఆయనకు నామినేటెడ్ పోస్టు కూడా ఇచ్చే అవకాశాలున్నాయి. మొత్తం మీద జగన్ ఆపరేషన్ మంగళగిరిని జగన్ ప్రారంభించినట్లే కనపడుతుంది.

# ఫిష్..ఫిట్ ఆంధ్రా

ఏలూరు, ఆగస్టు 20, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా మత్స్య, ఆక్వా కల్చర్ సుస్థిర అభివృద్ధికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని నిర్వహిస్తున్నాయి. ఇందులో ఆక్వా రైతులు, ఔత్సాహికులకు సబ్సిడీ అందిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మత్స్యశాఖ అధికారులు ఈ పథకంపై మత్స్యకార సొసైటీలు, రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. మొత్తం 14 రకాల ఆక్వా సంబంధిత ఉత్పత్తులకు ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తున్నాయి.చేపలు, రొయ్యల వినియోగాన్ని మరింత పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 2,50,045 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ప్రతి ఏటా 17,15,362 టన్నుల ఆక్వా ఉత్పత్తి జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024 వరకు ఐదేళ్ల కాలానికి గాను రూ.20,050 కోట్లు పీఎంఎంఎస్‌వై పథకానికి కేటాయించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.9407 కోట్లు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.4880 కోట్లు, లబ్ధిదారుల వాటా రూ.5763 కోట్లుగా ఉంది. పీఎంఎంఎస్‌వై పథకంలో 14 అంశాలకు సంబంధించిన వివిధ పథకాలు ఉన్నాయి. ఇందులో ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఎంచుకున్న యూనిట్‌లకు కేంద్రం 36 శాతం, రాష్ట్రం 24 శాతం కలిపి 60 శాతం సబ్సిడీని అందిస్తున్నాయి. లబ్ధిదారులు 40 శాతం చెల్లించాలి. ఇతరులకు కేంద్రం 24 శాతం, రాష్ట్రం 16 శాతం కలిపి మొత్తం 40 శాతం సబ్సిడీ అందిస్తున్నాయి. లబ్ధిదారులు 60 శాతం నగదు చెల్లించాలి.యూనిట్ల విషయానికి వస్తే చేప, రొయ్య పిల్లల నర్సరీకి రూ.7 లక్షలు, రిజర్వాయర్లలో కేజ్ కల్చర్‌కు రూ.3 లక్షలు, ఆక్వా ల్యాబ్ ఏర్పాటుకు రూ.25 లక్షలు, బతికిన చేపల అమ్మకాల యూనిట్‌కు రూ.20 లక్షలు, చేపల రవాణా రిఫ్రిజిరేటెడ్ వాహనానికి రూ.25 లక్షలు, ఫిష్ కియోస్క్ యూనిట్‌కు రూ.10 లక్షలు, రోజుకు 20 టన్నుల ఆక్వా ఉత్పత్తులు చేసే కర్మాగారానికి రూ.2 కోట్లు సైతం అందించనున్నారు. ప్రపంచంలోనే

చేపల ఉత్పత్తిలో మన దేశం రెండో స్థానంలో ఉంది. సింహభాగం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి సరఫరా అవుతోంది. మత్స్యరంగాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆక్వా హబ్‌లను ఏర్పాటు చేసి ఫిష్ ఆంధ్రా పేరుతో తాజా చేపలు, పీతలు, రొయ్యలను విక్రయించడానికి ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లాలో మొత్తం 101 వివిధ యూనిట్లకు గాను మొత్తం రూ.327.60 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో రాష్ట్ర వాటా రూ.131.04 లక్షలు, కేంద్ర వాటా రూ.196.56 లక్షలుగా ఉంది. ఈ పథకం ద్వారా మంజూరైన వాహనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

# సచివాలయాల్లో రెవెన్యూ సేవలు

నెల్లూరు, ఆగస్టు 20, రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి గ్రామ, వార్డు సచివాలయాల్లో వివిధ రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. గత నెల 15వ తేదీ నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటి వరకు మండల తహశీల్దార్, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే వారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఇందుకు సంబంధించిన అన్ని రకాల సేవలూ అందుబాటులోకి వచ్చాయని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఎవరైనా, ఎక్కడి నుండి అయినా ఈ సేవలను వినియోగించుకోవచ్చు. పట్టాదారు పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్, అడంగల్ కాపీలు సచివాలయం నుంచి వెంటనే జారీ చేస్తున్నారు. రికార్డుల్లో మార్పులు, భూమి స్వభావం వివరాలకు సంబంధించిన ఏటువంటి మార్పులకు అయినా సచివాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. వీటి పరిష్కారానికి ప్రభుత్వం 21 రోజులు గడువు విధించింది. దరఖాస్తు (ఫారం 8)ను సమర్పించిన 24 గంటల్లో సచివాలయం నుంచి ఆన్‌లైన్లో సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్‌ఒ)కి చేరుతుంది. విఆర్‌ఒ విచారణకు 15 రోజుల గడువు విధించారు. అభ్యంతరాల స్వీకరణకు దరఖాస్తు వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలి. ఎవరైనా అభ్యంతరాలు తెలియజేస్తే తహశీల్దార్‌కు నివేదించాలి. అభ్యంతరాలు లేకుంటే 16వ రోజు కల్లా విఆర్‌ఒ తన నివేదికను తహశీల్దార్‌కు సమర్పించాలి. సంబంధిత తహశీల్దార్ దరఖాస్తును పరిష్కరించినా, తిరస్కరించినా రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్‌డిఒ)కి నివేదించాలి. తిరస్కరణకు గురైన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆర్‌డిఒకు వెళతాయి. ఆర్‌డిఒ పరిశీలించి ఆమోదం తెలపవచ్చు. లేదా తహశీల్దార్ అభిప్రాయాన్ని ఆమోదించవచ్చు. 15 రోజుల్లోగా అభ్యంతరాలు తెలియజేయలేని సమీప భూయజమానులు ఆ తర్వాత ఆర్‌డిఒకు అప్పీలు చేసుకోవచ్చు. ఆర్‌డిఒ, తహశీల్దార్లకు కూడా రెండేసి రోజులు సమయం ఇచ్చారు. చివరిగా 21 రోజుల్లో సంబంధిత దరఖాస్తుదారుడికి పత్రాలు అందించాలి.

భూ లావాదేవీల్లో మార్పులకు సంబంధించి దరఖాస్తుల పరిష్కారానికి నెల రోజులు గడువు విధించారు. గుంటూరు జిల్లాలో గత 45 రోజుల్లో 692 మంది రికార్డుల్లో మార్పులకు, 711 మంది హక్కుల బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. వీటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తున్నామని, రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించని 33 మంది విఆర్‌ఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. భూ సంబంధిత అంశాలపై సచివాలయాలకు వస్తున్న దరఖాస్తుల పరిష్కార పురోగతిని జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు ఇచ్చింది.

# ఏం చేద్దాం..తమ్ముళ్లు...

### టీడీపీలో సర్వేల టెన్షన్

విజయవాడ, ఆగస్టు 20, జాతీయ మీడియా సర్వేలు వైసీపీకి అనుకూలంగా వస్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైసీపీయే అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని సర్వేలు చెబుతున్నాయి. లోక్‌సభ సీట్ల వారీగా జాతీయ మీడియా సంస్థలు సర్వేలు నిర్వహిస్తున్నాయి. 2024 లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. రెండేళ్ల ముందే జాతీయ మీడియా సంస్థలు సర్వేలు ప్రారంభించాయి. పీపుల్స్ పల్స్ ఎలా ఉందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అయితే ఏ సర్వే చూసినా అధికార పార్టీ వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారని సర్వేల్లో స్పష్టమవుతుంది.ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తుందని దాదాపు అన్ని సర్వేల్లో తేలింది. అలాగే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ ల పట్ల క్రేజ్ తగ్గలేదని సర్వేల్లో స్పష్టంగా కనిపిస్తుంది. కేంద్రంలో మోదీ రెండుసార్లు, తెలంగాణలో కేసీఆర్ రెండుసార్లు ఇప్పటికే విజయం సాధించారు. హ్యాట్రిక్ విజయం కోసం ఇద్దరూ ఉవ్విళ్లూరుతున్నారు. ఇద్దరికీ జాతీయ మీడియా సంస్థలు జరిపిన సర్వేల్లో అనుకూల ఓట్లు పడ్డాయి. తిరిగి కేంద్రంలో మోదీ ప్రభుత్వం, తెలంగాణలో కేసీఆర్ సర్కార్ రావడం ఖాయమని తేల్చాయి. టైమ్స్ నౌ సర్వేలో తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీకి ఆరు నుంచి పది పార్లమెంటు స్థానాలు వస్తాయని చెప్పింది. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే తాజాగా టైమ్స్ నౌ మరోసారి సర్వే చేసింది. ఆగస్టు 15వ తేదీ వరకూ సర్వే నిర్వహించామని ఆ సంస్థ స్పష్టం చేసింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏపీలో జగన్ పార్టీకి 17 నుంచి 23 పార్లమెంటు స్థానాలు వస్తాయని తేల్చి చెప్పింది. అంటే పార్లమెంటు సీట్ల ప్రకారం చూస్తే అసెంబ్లీ సీట్లు కూడా గతంలో మాదిరిగానే వైసీపీకి వస్తాయి. దీంతో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. 25 పార్లమెంటు స్థానాల్లో అత్యధిక స్థానాలను వైసీపీయే కైవసం చేసుకుంటుందని చెప్పడం విశేషం. మూడేళ్లలో జగన్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఉందనుకుంటున్న తరుణంలో సర్వేలు అనుకూలంగా రావడంతో విపక్ష పార్టీలు కొంత డైలమాలో పడ్డాయి.

# 70 నియోజకవర్గాల్లో ఆవేదన

విజయవాడ, ఆగస్టు 20, వైసీపీ ఎమ్మెల్యేలు గగ్గోలు పెడుతున్నారా ? రాష్ట్రంలో దాదాపు 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుస్తామా ? లేక ఇప్పటితో సరా అంటూ.. వారు తమ అనుచరుల వద్ద వ్యాఖ్యానిస్తున్నారు. విషయంలోకి వెళ్తే.. గత ఎన్నికల్లో యువతకు, ముఖ్యంగా కొత్తవారికి జగన్ ఎమ్మెల్యే టికెట్ లు ఇచ్చి విజయం సాధించేలా ప్రోత్సహించారు. అందరూ ఎమ్మెల్యేలు అయ్యారు. అయితే.. ఇప్పుడు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో నిధులు వీరికి అందడం లేదు.దీంతో నియోజకవర్గాల్లో సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని వాపోతున్నారు. ప్రభుత్వం ఒకవైపు లక్షల కోట్లతో ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్నా.. రేపు ఎన్నికల సమయానికి తాము ప్రజల దగ్గరకు వెళ్తే.. నియోజకవర్గం అభివృద్ధి విషయాన్ని ప్రశ్నించకుండా ఉంటారా? అనేది వీరి అనుమానం. అంతేకాదు.. ప్రజలతో తమకు సంబంధాలు కూడా ఉండడం లేదని.. వలంటీర్లు-ప్రజలు, సీఎం-ప్రజలు, అధికారులు-ప్రజలు అన్నట్టుగానే పరిస్థితి ఉందని.. తమను ఎవరూ ఖాతరు చేయడం లేదని వైసీపీ ఎమ్మెల్యేలు వాపోతున్నారు.పలు నియోజకవర్గాల్లో సమస్యలు తిష్టవేశాయి. చంద్రబాబు హయాంలో కొంత మేరకు పనులు జరిగినా.. చాలా చోట్ల పనులు నిలిచిపోయాయి. ఉదాహరణకు గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో వెలిసల సాగునీటి ప్రాజెక్టును నిర్మించాలనేది ఇక్కడి ప్రజల డిమాండ్. గత చంద్రబాబు ప్రభుత్వంలో కేంద్రం నుంచి కొద్దిగా నిధులు తెచ్చి ప్రారంభించారు. దీనికి రాష్ట్ర సర్కారు వాటా ఇవ్వాల్సి ఉంది. కానీ, ఇది ముందుకు సాగడం లేదు. విజయవాడ-మచిలీపట్నం.. ప్రధాన రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన వారికి ఇప్పటికి నష్టపరిహారం అందలేదు. దీంతో వైసీపీ ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.అదేసమయంలో ప్రకాశంజిల్లా దొనకొండ అభివృద్ధి సహా అనేక ప్రాజెక్టులకు ఎన్నికలకుముందు ప్రజలకు హామీ ఇచ్చినా.. ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మరోవైపు.. రహదారులు గుంతలు పడిపోయినా.. పట్టించుకుని బాగు చేసేందుకు స్థానిక వైసీపీ ఎమ్మెల్యేలకు నిధులు చిక్కడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎమ్మెల్యేలు నిధులు అడుగుతున్నా అపాయింట్‌మెంట్లు లేవు.. నిధులూ రావడం లేదు.వైసీపీ ప్రభుత్వం సంక్షేమం చేస్తున్నా.. నేరుగా ప్రజలకు డబ్బులు ఇస్తున్నా.. స్థానిక సమస్యలను కూడా పట్టించుకునేందుకు ఎమ్మెల్యేలకు కూడా నిధులు ఇవ్వాలి కదా! అంటున్నారు కొత్తగా ఎన్నికైన నాయకులు. సీనియర్లు అంటే..ఎలాగోలా మేనేజ్ చేస్తున్నారని.. తాము ప్రజలకు ముఖం చూపించలేక పోతున్నామని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

# యాప్ లతో టీచర్ల అవస్థలు

విజయవాడ, ఆగస్టు 20,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తెచ్చిన ఆన్‌లైన్ హాజరు విధానం ఉపాధ్యాయులను ముపుతిప్పలు పెడుతుంది. ఒక ముడి విప్పబోయి మరో ముప్పై మూడు ముడులు వేసుకుంటే ఇక ఎప్పటికీ ఒక్క ముడిని కూడా విప్పలేము. అలాగే సమస్య ఎక్కడ ఉందో గుర్తించి దానిని పరిష్కరించాలి.. కానీ, మొత్తం గందరగోళంగా చేసుకోకూడదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన తొలిరోజే ఈ ఫేస్ క్యాప్చరింగ్ అటెండెన్స్ ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతోంది. " మేం విద్యార్థులకు పాఠాలే చెప్పాలా..యాప్ లతో కుస్తీ పట్టాలా" అని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శలు గుప్పిస్తున్నారు. యాప్ అటెండెన్స్ విధానం వల్ల తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఫేస్ క్యాప్చరింగ్ అటెండెన్స్ విధానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఉపాధ్యాయులు నానా తంటాలు పడుతున్నారు. యాప్ డౌన్‌లోడ్‌కు తోడు.. ఫొటో అప్‌లోడ్ చేయడానికి ఉపాధ్యాయులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.. ప్రభుత్వం వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విధానం.. ఉపాధ్యాయులపై కక్షసాధింపుగా ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పీఎఫ్ నిధులు ఇంకా జమకు నోచుకోలేదని విమర్శిస్తున్నారు.. మొత్తంగా.. టీచర్స్ అటెండెన్స్ యాప్‌తో మొదటి రోజే తిప్పలు తప్పలేదు.. నెట్ లేక కొంతమంది, స్మార్ట్ ఫోన్స్ లేక ఇంకొంత మంది ఈ యాప్‌తో ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు..

# ఆందోళనలో పాడి రైతులు

రాజమండ్రి, ఆగస్టు 20, పశు వైద్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పశువైద్యశాలలను రేషనలైజేషన్ చేయడానికి పశుసంవర్ధక శాఖ అడుగులు వేస్తోంది. ఈ మేరకు మూడు రకాల ప్రతిపాదనలతో నివేదిక రూపొందించారు. ప్రభుత్వ తాజా నిర్ణయం పాడి రైతులతో పాటు గ్రామీణ పశువైద్య కేంద్రాల్లో పని చేస్తోన్న సిబ్బందిని ఆందోళనకు గురి చేస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో 58 గ్రామీణ పశువైద్యశాలలు, 31 ఏరియా పశు ఆస్పత్రులు, 157 వెటర్నరీ డిస్పెన్సరీలు ఉన్నాయి. వాటితో పాటు 210 మంది గోపాలమిత్రల ద్వారా పశుసంవర్ధక శాఖ గ్రామాల్లో పశు వైద్య సేవలను అందిస్తోంది. రేషనలైజేషన్ పేరుతో గ్రామీణ సిబ్బందిని మండలాలు, తాలుకా ఆస్పత్రులకు సర్దుబాటు చేసి, లైవ్ స్టాక్ డిస్పెన్సరీలను ఎత్తివేసే ప్రక్రియ మొదలైందని సిబ్బంది అంటున్నారు. ఎక్కువ డిస్పెన్సరీలు ఉన్న ప్రాంతం నుంచి డిస్పెన్సరీలు లేని మండలాలకు కొన్నింటిని తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.ప్రభుత్వం ఈ ఏడాది మే 27న పశువైద్యశాలల విలీనంపై జిఒ 131 విడుదల చేసింది. మూడు విధాలుగా ప్రణాళికలు రూపొందించాలని కోరింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారి ఆధ్వర్యంలో మూడు రకాల ప్రతిపాదనలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. ప్లాన్-ఎ ప్రకారం ప్రతి మండలానికి రెండు వెటర్నరీ డిస్పెన్సరీలు ఏర్పాటు చేసి, గ్రామాల్లోని పశు వైద్య కేంద్రాలను వాటిలో విలీనం చేయాలి. ప్లాన్-బి కింద మండలానికి ఒకటి లేదా రెండు వెటర్నరీ ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని, ఆ మండలంలో రెండు, మూడు పశువైద్య కేంద్రాలను ఉంచాలని సూచించినట్లు సమాచారం. ప్లాన్-సిలో ప్రతి మండలంలో మూడు వెటర్నరీ పశు వైద్యశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.గ్రామీణ ప్రాంతాల్లో సాగుతోపాటు అధిక శాతం మంది రైతులు పశుపోషణపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. జిల్లాలో ఏడాదికి 9,378 టన్నుల పాల దిగుబడి వస్తోంది. పశువైద్యం సకాలంలో అందించడంలో ఇప్పటికే అనేక సమస్యలు ఉన్నాయి. పశువైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. దీనికి తోడు ఇతర సమస్యలు కూడా వెన్నాడుతున్నాయి. వీటిని పరిష్కరించకుండా కుదింపు చర్యలకు పాల్పడడంపై సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది. ఆర్‌బికెల్లో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లను ప్రత్యామ్నాయంగా చూపించి పశువైద్యశాలల సంఖ్య కుదింపునకు సిద్ధపడటంపై విమర్శలు విన్పిస్తున్నాయి.

# విశాఖ టీడీపీలో లుకలుకలు

విశాఖపట్టణం, ఆగస్టు 20,ఉత్తరాంధ్రలో రాజకీయాల వేడి ఎన్నికలప్పుడు మాత్రమే కనిపిస్తుంది. దానికి భిన్నంగా విశాఖ దక్షిణ నియోజకవర్గ టీడీపీలో కొత్త పోకడలు సెగలు రేపుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే ఇంట్లో పెళ్లి వేడుక దానికి కారణం కావడం మరింత చర్చగా మారింది. ఇటీవల ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కుమారుడి వివాహ రిసెప్షన్ జరిగింది. వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వధూవరులను ఆశీర్వదించారు. ఇదే ఫంక్షన్‌కు వెళ్లిన దక్షిణ నియోజకవర్గ టీడీపీ లీడర్లు, కేడర్ రాజకీయ కారణాలతో అడకత్తెరలో పడ్డారు.ఎమ్మెల్యే వాసుపల్లి రెండుసార్లు టీడీపీ నుంచి గెలిచారు. ప్రస్తుతం వైసీపీకి జైకొట్టారు. దాంతో నియోజకవర్గంలోని కేడర్‌ను కాపాడుకునేందుకు మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీకి పార్టీ ఇంఛార్జ్‌గా బాధ్యతలు అప్పగించింది టీడీపీ. వాసుపల్లి ఇంట పెళ్లి వేడుక్కి వెళ్లొద్దని గండి బాబ్జి.. సౌత్ టీడీపీ శ్రేణులకు ఆదేశాలు జారీ చేశారు. వెళ్లినవాళ్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు కూడా. ఈ ఆదేశాలు పార్టీ అంతర్గత గ్రూపుల్లో చర్చకు దారి తీశాయి. 15 ఏళ్లపాటు ఒకేపార్టీలో కలిసి పనిచేసిన నాయకుడి ఇంట్లో పెళ్లికి వెళ్లొద్దనడంపై కొందరు ప్రశ్నలు లేవనెత్తారు. వాసుపల్లితో బంధుత్వం ఉన్నవాళ్లు టీడీపీ నాయకులుగా ఉన్నా రు. పార్టీ కోసం త్యాగాలు చేస్తాం కానీ.. బంధుత్వాలను, స్నేహాలను వదులుకోమంటే సాధ్యం కాదని కొందరు గండి బాబ్జీ ముందే వాళ్లు కుండబద్దలు కొట్టేశారట. చాలా మంది ఇంఛార్జ్ ఆదేశాలను లెక్క చేయలేదు.ఇంఛార్జ్ హోదాలో బాబ్జీ చర్యలు తీసేసుకున్నారు. ఒక మహిళా నాయకురాలిని పార్టీ వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించడంతో ఆమె నేరుగా పార్టీ ముఖ్యులకు ఫిర్యాదు చేశారట. టీడీపీలో కొత్తగా ఈ షరతులేంటి అని ఆమె ప్రశ్నించారట. ఈ ఎపిసోడ్‌లో మరో ట్విస్ట్ ఉంది. విశాఖ సౌత్ లీడర్లే కాకుండా.. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన చాలామంది టీడీపీ సీనియర్ నాయకులు వాసుపల్లి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. దాంతో మమ్మల్ని వెళ్లకుండా నియంత్రించాలని అనుకున్న బాబ్జీ.. సీనియర్ లీడర్లకు ఎందుకు బ్రేకులు వేయలేదని గట్టిగా నిలదీస్తున్నారట. రాజకీయాల్లో దూకుడు అవసరమైనా.. ఈ తరహా స్పీడ్ ప్రదర్శిస్తే పార్టీలో కొనసాగడం కష్టమని టీడీపీ పెద్దలకు చెప్పాలనే ఆలోచనలో ఉన్నారట నాయకులు. ప్రస్తుతం దక్షిణ నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఎమ్మెల్యే వాసుపల్లి, గండి బాబ్జీ ఇద్దరు ప్రజలకు దగ్గరయ్యేందుకు పోటీ పడుతున్నారు. ఇలాంటి తరుణంలో అనవసరమైన వ్యవహారాలను టీడీపీ ఇంఛార్జ్ నెత్తిన పెట్టుకుంటే నష్టం తప్ప ఫలితం ఉండదని పెదవి విరుస్తున్నారట సీనియర్లు.

### విజయవాడలో వైజాగ్ సీన్ రిపీట్.. లవర్ కోసం కాలువలో దూకిన బాలిక

విజయవాడ వైజాగ్ సాయి ప్రియ మిస్సింగ్ కేసు గుర్తుందా? గుర్తుండే ఉంటుందిలేండి.. అంత త్వరగా మర్చిపోయే ఘటన కాదు మరి. అయితే, తాజాగా అచ్చం అలాంటి ఘటనే.. వైజాన్ సీన్‌కు 2.ఒ లాంటి సీన్ విజయవాడలో వెలుగు చూసింది. ఆ ఘటన సంబంధించిన వివరాలు తెలిస్తే మైండ్ బ్లాంక్ అవడం ఖాయం. అవును, ఓ బాలిక తన ప్రేమికుడి కోసం ఏకంగా కాలువలోకి దూకింది. అలా ఆత్మహత్య చేసుకున్నట్లు అందరికీ కలరింగ్ ఇచ్చిన బాలిక.. అక్కడి నుంచి పరారైంది. అయితే, కుటుంబ సభ్యులు, బంధువు అందరూ ఆ బాలిక టెన్త్ ఫెయిల్ కావడంతో సూసైడ్ చేసుకుందని భావించారు. కానీ, పోలీసులు అంత ఈజీగా నమ్మరు కదా.. ఇక్కడా అదే జరిగింది. కట్ చేస్తే నెల రోజుల తరువాత మేడం గారీ హైడ్రామా అంతా బయటపడింది. ఆ బాలిక ప్లాన్ తెలిసి పోలీసులే అవాక్కయ్యారు. ఇంతకీ బాలిక అలా ఎందుకు చేసింది? అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.ఈత రావడంతో జంప్.. గత నెల 22వ తేదీన బాలిక(17) ఏలూరు కాలువలోకి దూకింది. రాత్రి సమయంలో అందరూ చూస్తుండగానే కాలువలోకి దూకేసింది. విషయం తెలుసుకున్న గుణదల పోలీసులు కాలువ వద్దకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రెండు రోజులపాటు తీవ్రంగా గాలించారు. తల్లిదండ్రులను అడిగితే.. పదవ తరగతి పరీక్ష ఫెయిల్ అవడంతో దూకేసిందని సమాధానం ఇచ్చారు. అయితే, రెండు రోజులు వెతికినా కాలువలో బాడీ దొరక్కపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. తమదైన శైలిలో విచారణ చేపట్టారు. బాలిక తల్లిదండ్రులు, ఆమె స్నేహితులను విచారించారు. ఈ విచారణలో బాలికు ఈత వచ్చని తెలియడం, ఆమె ప్రేమ వ్యవహారం వంటి వివరాలు తెలియడంతో.. మిస్టరీ చేధన మరింత ఈజీ అయ్యింది.. స్థానికంగా ఉండే రౌడీషీటర్ దుర్గారావుతో బాలిక మూడేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుపుతోంది.

# నిషేదం ఉన్నప్పటికీబ్యాక్ వాటర్ లో అక్రమ చేపల వేట



**చర్యలు తీసుకోవాల్సిన వారు ఎప్పుడో చేతులెత్తేశారు**

**అక్రమ చేపల వేట లో దేవాదాయ శాఖ ఉద్యోగి**

**నిషిద్ధ వలలతో చేపల వేట...తిలాపాపం తలా పిడికెడు**

బద్వేలు బద్వేలుకు పొరుగునే ఉన్న గోపవరం మండలం సోమశిల ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ లో చాలా కాలంగా అక్రమ చేపల వేట సాగుతుంది బద్వేల్ కేంద్రంగాకొందరు వ్యక్తులు ఈ దందాను కొనసాగిస్తూ కోట్ల రూపాయలు వెనక వేసుకుంటున్నారు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎప్పుడో చేతులు ఎత్తేశారు చేపల వేట నిషిద్ధ కాలంలో సైతం వీరి అక్రమ చేపల వేట కొనసాగుతుంది ఇది అందరికీ తెలిసిన రహస్యమే అక్రమ చేపల వేట సాగించేవారు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ లో ఉండడం సర్వసాధారణమైంది అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతూ చేపల వేట సాగిస్తున్నారు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే నిషిద్ధ వలలతో చేపల వేట సాగుతుంది ఎంతో బహిరంగంగా జరుగుతున్న చేపల వేట పై అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు నిషిద్ధ వలలతో చేపలు పట్టి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి ప్రతి సంవత్సరం కోటానుకోట్ల రూపాయలు గడిస్తున్నారు ఈ వ్యవహారం చాలా సంవత్సరాలుగా జరుగుతుంది సోమేశిల జలాశయంలో స్థానిక మత్స్యకారులు చేపలు పట్టి జీవనం సాగిస్తూ ఉంటారు ఈ ముసుగులో కొందరు విశాఖపట్నం శ్రీకాకుళం కాకినాడ తదితర ప్రాంతాల నుంచి మత్స్యకారులు రప్పించి అక్రమాలకు తేర తీశారు నిషిద్ధ ఆలివ్ వలలను ఉపయోగించి చిన్న చేపలను గుడ్డు దశలోనే ఒడ్డుకు పడేస్తున్నారు దీంతో మత్స్యకారులకు ఉపాధి కోల్పోతున్నారు అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు చేపల వేట నియంత్రించ వలసిన అధికారులు అక్రమ చేపల వేట చేసే వారి వద్ద పెద్ద మొత్తంలో ముడుపులు దండుకొని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తున్నారు ఇది కూడా అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే పెన్నా నది పై నెల్లూరు జిల్లాలో సోమశిల జలాశయం నిర్మించినప్పటికీ నీటి నిలువ ప్రాంతం కడప జిల్లాలో ఉంది జలాశయంలో ప్రతి సంవత్సరం మత్స్యశాఖ చేప పిల్లలు వదులుతుంది ఈ జలాశయానికి పది కిలోమీటర్ల దూరంలో ఉండే మత్స్యకారులు నిరుపేదలు వారికి చేపల వేట తప్ప మరో ఉపాధి లేదు వారికి మత్స్యశాఖ అధికారులు అనుమతులు ఎప్పుడో ఇచ్చారు జిల్లాలోని గోపవరం ఒంటిమిట్ట నందలూరు మండలాలకు చెందిన దాదాపు 200 మంది పైగా మత్స్యకారులకు అధికారులు లైసెన్సులు ఇవ్వడం జరిగింది హైకోర్టు ఆదేశాల మేరకు స్థానికేతరులు కూడా కొంతమందికి లైసెన్సులు ఇచ్చారు నిబంధనల ప్రకారం స్థానిక వలలతో చేపలు పట్టి వాటిని అమ్మి జీవనం సాగించాలి కానీ దానికి పూర్తి విరుద్ధంగా చేపల వేట ఇక్కడ సాగుతుందిసోమశిల జలాశయం అడ్డాగా బద్వేలు ఒంటిమిట్ట కడప ప్రాంతాల చెందిన చేపల లైసెన్స్ కాంట్రాక్టర్లు మరి కొంతమంది వ్యాపారులు మత్స్య మాఫియా నడుపుతున్నారు ఇది కూడా అందరికీ తెలిసిన విషయమే నిబంధనలు ఎప్పుడో సోమేశిల జలాశయంలో తొక్కేశారు కాకినాడ విశాఖపట్నం శ్రీకాకుళం జిల్లాల నుంచి ఎంతో ప్రసిద్ధి పొందిన మత్స్యకారులను ఇక్కడికి తీసుకువచ్చి వారి చేత అక్రమంగా చేపలు పట్టిస్తున్నారు ఇతర జిల్లాల నుంచి ఇలా రప్పించిన మత్స్యకారులను స్థానికంగా నివాసాలు ఏర్పాటు చేసి వారి ద్వారా అక్రమ చేపల వేట సాగిస్తున్నారు అక్రమ చేపల వేట సాగించేవారికి స్థానికంగానే ఆధార్ కార్డులు ఏర్పాటు చేయడం విశేషం కొంతమంది రెవెన్యూ అధికారులు సిబ్బంది వీరికి అన్ని విధాల సహకారం అందిస్తున్నారు ముఖ్యమైన విషయం ఏమిటంటే బద్వేలు దేవాదాయ శాఖలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి అక్రమ చేపల వేటలో ప్రధాన పాత్ర వహిస్తున్నట్లు సమాచారం ఈ విషయాన్ని దేవాదాయ శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు బహిరంగంగానే చెబుతుండడం విశేషం అక్రమ చేపల వేట చేస్తున్న వారిలో దాదాపు 80 శాతం మందికి ఎటువంటి లైసెన్సులు లేవు ఆగస్టు చివరి వరకు జలాశయం లో ఎలాంటి చేపల వేట జరగకూడదని మత్స్యశాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు కానీ జలాశయంలో చేపల వేట సాగుతూనే ఉంది అధికారులు మొక్కుబడిగా దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారు అక్రమంగా పట్టిన చేపలను పెద్ద పెద్ద వాహనాల ద్వారా బద్వేలు కు తీసుకువచ్చి ఇక్కడ నుండి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు ఆలివ్ వలలుఉపయోగించడంతో పెద్ద పెద్ద చేపలు తో పాటు గుడ్డు దశ లో ఉన్న చేపలు కూడా ఈ వలలకు చిక్కుతుంటాయి మత్స్యశాఖ వదిలిన షీట్ చేప పిల్లలు ఒడ్డున పడి గిలగిల కొట్టుకోవాల్సిందే ఈ వలలకు టన్నులకొద్ది చేపలు చిక్కుతుంటాయి చేప సైజును బట్టి కిలో 40 నుండి 50 రూపాయల వరకు చెల్లిస్తారు వారు బయట మార్కెట్లో రెండింతలకు అమ్ముకుంటారు ఇక్కడ నుండి గుజరాత్ అహ్మదాబాద్ ఢిల్లీ పశ్చిమ బెంగాల్ హౌరా మహారాష్ట్ర కర్ణాటక తదితర ప్రాంతాలకు వీటిని అక్రమంగా రవాణా చేస్తుంటారు ఈ వ్యాపారం ప్రతిఏటా కొన్ని కోట్ల రూపాయల్లో సాగుతుంది ఇలా జరిగే వ్యాపారానికి ఎలాంటి లెక్కలు ఉండవు చేపల కాంట్రాక్టర్లకు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో వీరి అక్రమ వ్యాపారాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలకు వీరు గులాం అవుతారు ఇది కూడా అందరికీ తెలిసిన విషయమే నిషిద్ధ ఆలివ్ వలలు వాడుతున్న అక్రమంగా చేపల వేట సాగుతున్నప్పటికీ అధికారులు గాంధారి పాత్ర పోషిస్తున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం అలాగే అక్రమ చేపల వేట సాగించేవారు అటవీ నిబంధనలకు ఎప్పుడో తూట్లు పొడిచారు జలాశయం బ్యాక్ వాటర్ ప్రవహించే ప్రాంతం శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వామి అభయారణ్యం పరిధిలో ఉంది అటవీ చట్టాల ప్రకారం ఎవరైనా అడవిలోకి వెళ్లాలంటే అనేక అనుమతులు తీసుకోవాల్సి ఉంది కానీ అభయారణంలోకి ఎలాంటి అనుమతులు లేకుండా వాహనాలు మనుషులు వెళుతుంటారు అటవీ ప్రాంతంలో మనుషులు వాహనాలు వెళ్ళకూడదు అని అభయారణంలో శాఖ అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డులు ఉన్నాయి కానీ ఇవి ఏమి అక్రమ చేపల వేట సాగించేవారికి కనపడవు వినపడవు అటవీశాఖ అధికారుల హెచ్చరికలు అక్రమంగా చేపల వేట సాగించేవారు ఎప్పుడో ఉల్లంఘించారు మత్స్య శాఖ అధికారుల అండ ఉన్నంతవరకు వీరి అక్రమ చేపల వేటకు హద్దు ఉండదని చెప్పాలి

# ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

**ప్రియురాలు మృతి?..ప్రియుడికి తీవ్రగాయాలు**

విశాఖపట్నం రైల్వే ట్రాక్ పై ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఈ సంఘటనలో రైలు ఢీకొనడంతో ప్రియురాలు మృతి చెందగా, ప్రియుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.విశాఖజిల్లా పెందుర్తి మండలం పరిధిలోని కొత్తపాలెంలో నివాసం ఉంటున్న కొణతాల హేమకు గతంలో వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయితే భర్తగా దూరంగా పిల్లలతో కొత్తపాలెంలో ఆమె ఉంటుంది. ఈ తరుణంలో కోట నరవ ప్రాంతాన్ని చెందిన కుమార్ అనే యువకుడితో ఏర్పడిన పరిచయం వీరిద్దరి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇది ఇలా ఉండగా శనివారం ఉదయం సత్తివానిపాలెం రైల్వే ట్రాక్ వద్దకు చేరుకొని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ సమయంలో ట్రాక్ పై వస్తున్న రైలుకి ఎదురుగా పడిపోయి ఇద్దరూ ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలై హేమ అక్కడికక్కడే మృతి చెందగా, ప్రియుడు కుమార్ గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రియుడు కుమార్ ను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చారు. హేమ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా తల్లి మృతి చెందడంతో ఇద్దరి చిన్నారులు అనాధలుగా మారిపోవడం అక్కడివారిని కలిచివేసింది. సిఐ అశోక్ కుమార్ నేతృత్వంలో పెందుర్తి ఎస్సై గణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి అందించిన రాజీవ్ గాంధీ

కడప కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడని భారతదేశాన్ని 21వ శతాబ్దంలో కి తీసుకుపోవడంలో ఎనలేని కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు కొనియాడారు.శనివారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నీలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలోఆ పార్టీ శ్రేణులు ముందుగా రాజీవ్ పార్క్ వద్దగల రాజు విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు.అనంతరం జిల్లా పార్టీ కార్యాలయం కడపలో రాజీవ్ విగ్రహానికి పూలమాల వేశారు.తర్వాత కడప నగరం ప్రకాష్ నగర్ లోని స్నేహాలయ నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.అనంతరం నీలి శ్రీనివాసరావు మాట్లాడుతూ, అతి చిన్న వయసులోనే రాజీవ్ గాంధీ భారతదేశానికి ప్రధాని అయ్యారని, 401 పార్లమెంటు స్థానాలు సంపాదించి భారత ప్రధాని పీఠం అధిష్టించారన్నారు.73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు.18 సంవత్సరాలకే యువకులకు ఓటు హక్కు కల్పించారన్నారు.కమ్యూనికేషన్ రంగాన్ని అభివృద్ధి పరచి ఈరోజు ప్రతి ఒక్కరి చేతిలో సెల్ఫోన్ ఉంది అంటే దానికి కారణం రాజీవ్ గాంధీ అన్నారు.ప్రతి ఇంట్లో టెలివిజన్ ఉంది అంటే కారణం రాజీవ్ గాంధీ అన్నారు.విద్యా రంగాన్ని, వైద్య రంగాన్ని, మౌలిక రంగాన్ని, శాస్త్ర, సాంకేతిక రంగాన్ని, గ్రామీణ వ్యవస్థను అభివృద్ధి చేసిన శ్రీ రాజీవ్ గాంధీ ఎప్పటికీ ప్రజల హృదయాలలో చేరగని ముద్ర వేసుకున్నారు అన్నారు.రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు.బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి, మైనారిటీలు, మహిళలు, వెనుకబడిన వర్గాల వారి అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు తో పాటు, రాష్ట్ర ఆర్గనైజింగ్సెక్రెటరీవెంకటరమణారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెనీ విజయభాస్కర్, రాష్ట్ర మైనార్టీ నాయకుడు అలీ ఖాన్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కులాయప్ప,జిల్లా కార్యదర్శి సాదికలి, మల్లికా బేగం, అరుణ, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆనంద్, సూర్యుడు, కమల్ ఖాన్, సత్యం, ప్రవీణ్, పాల్గొన్నారు.

# నేడు కేంద్ర మాజీ మంత్రి టైగర్ ఆలె నరేంద్ర జయంతి

ఆలె నరేంద్ర 1946, ఆగష్టు 21న హైదరాబాదులోని నారాయణగూడలో పుష్పవతి, రామలింగం దంపతులకు జన్మించారు. ఇంటి పేరు ఆలె బదులు అంతా టైగర్ నరేంద్ర అని పిలిచేవారు. స్థానికంగా హైదరాబాదులోనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బియస్సీ పూర్తిచేశారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ క్రియాశీలక కార్యకర్తగా పదిహేడేళ్ల వయసులో రాజకీయాల్లోకి వచ్చారు. సిమ్లా ఒప్పందానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో పాల్గొని తీహార్ జైల్లో నెలపాటు శిక్షననుభవించారు. 1975లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమించి 18 నెలలపాటు జైల్లో ఉన్నారు. 1969-1972 వరకూ జన్‌సంఘ్‌కు ఫుల్‌టైమర్‌గా పని చేశారు. జనసంఘ్ జనతా పార్టీలో విలీనమైన తర్వాత 1980లో మొదటిసారిగా ఆ పార్టీ అభ్యర్థిగా హైదరాబాద్ పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడిపోయారు. 2003 వరకు భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగములో చెప్పుకోదగిన పాత్ర పోషించారు. నరేంద్ర 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ నుండి బయటికి వచ్చి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధనకై తెలంగాణ సాధన సమితి అనే ఒక రాజకీయ వేదికను ప్రారంభించాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పతాకస్థాయిలో ఉన్న దశలో తను స్థాపించన వేదికను కె.చంద్రశేఖరరావు ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర సమితిలో విలీనం చేశారు. ప్రారంభం నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడైన నరేంద్ర 1983 నుంచి 1994 మధ్యకాలంలో భారతీయ జనతా పార్టీ తరఫున ఆంధ్రప్రదేశ్ శాసనసభకు హిమాయత్‌నగర్ నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎన్నికైనాడు. 1978లో ఖైరతాబాదు నియోజకవర్గంలో పోటీ చేసి కాంగ్రెస్ పార్టీకి చెందిన పి.జనార్ధనరెడ్డి చేతిలో కేవలం 659 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1980లో హైదరాబాదు లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి కాంగ్రెస్ పార్టీకి చెందిన కె.ఎస్.నారాయణ చేతిలో పరాజయం పొందారు. 1983లో హిమయత్ నగర్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి పి.ఉపేంద్ర పై గెలుపొంది శాసనసభలో అడుగుపెట్టారు. 1985లో మళ్ళీ అదే స్థానం నుంచి పోటీ చేసి కె.ప్రభాకరరావుపై గెలుపొందాడు. 1992లో హిమయత్ నగర్ శాసనసభ నియోజకవర్గంలో గెలుపొంది మూడవసారి శాసనసభలో అడుగుపెట్టాడు. 1994లో తెలుగుదేశం పార్టీకి చెందిన కృష్ణయాదవ్ పై ఓడిపోయాడు.1999లో భారతీయ జనతా పార్టీ తరఫున లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీకి చెందిన బాగారెడ్డిపై విజయం సాధించి తొలిసారి లోక్‌సభ సభ్యులైయ్యారు. 2003 వరకు భారతీయ జనతా పార్టీలో మంచి పేరు సంపాదించుకొని అభిమానులచే టైగర్‌గా పిలుపించుకున్నాడు. ప్రత్యేక తెలంగాణా వాదంతో కె.చంద్రశేఖర్ రావు ప్రారంభించిన పార్టీలో చేరి ఆ పార్టీలో రెండో ముఖ్య నాయకుడిగా వ్యవహరించారు. 2004లో మళ్ళీ మెదక్ నియోజకవర్గం నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి తరఫున పోటీ చేసి భారతీయ జనతా పార్టీకు చెందిన పి.రామచంద్రారెడ్డిపై 1,23,756 ఓట్ల మెజారిటీతో గెలిచి రెండో పర్యాయం లోక్‌సభలో అడుగుపెట్టడమే కాకుండా మే 23 న కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిపదవిని పొందారు.నకిలీ వీసా కేసులో చిక్కుకొని ఏప్రిల్ 2007లో తెలంగాణా రాష్ట్ర సమితి నుంచి బహిష్కృతుడై , ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితి (నరేంద్ర) అనే కొత్త పార్టీని స్థాపించాడు. ఆ పార్టీకి జనాదరణ లభించకపోవడంతో 2008 జనవరి 8న హైదరాబాదులో మాయావతి సమక్షంలో బహుజన సమాజ్ పార్టీలో చేరారు. అమెరికాతో అణుఒప్పందం విషయంలో వామపక్షాలు యు.పి.ఏ.ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకున్న పిదప జరిగిన పరిణామాలతో నరేంద్ర యు.పి.ఏ.ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి ఆ అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరాడు. 2009 ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభకు ఎన్నికైయ్యాడు. అనంతర కాలంలో భారతీయ జనతా పార్టీలో చేరి పనిచేశాడు.అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌కు చెందిన నాంపల్లి లోని కేర్ ఆసుపత్రిలో ఏప్రిల్ 9, 2014న పరమపదించారు.

# మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 78వ జయంతి

మందమర్రి ఈరోజు మందమర్రి మండల పొన్నరం గ్రామంలో దివంగత భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 78వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మందమర్రి మండల అధ్యక్షులు కదారి జీవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి అక్కడ స్కూల్ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దివంగత నేత రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మర్చిపోలేము అని అన్నారు.భారతదేశ పంచాయతీ వ్యవస్థ, టెలికం రంగాన్ని తీసుకువచ్చింది రాజీవ్ గాంధీ ఘనతనాన్ని అంతేకాకుండా 18 సంవత్సరాల నిండిన శ్రీ, పురుషులను ఓటు హక్కు చట్టాన్ని తీసుకువచ్చింది కూడా రాజీవ్ గాంధీ అంతేకాకుండా ఆయన ప్రధానమంత్రి ఉన్నంతకాలం బడుగు బలహీన వర్గాలను పేదలని అనేక సంక్షేమాలు పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందని అతి చిన్న వయసులో భారతదేశం ప్రధాని అవ్వడం ఆయనకే దక్కిందని.1991లో అప్పటి ప్రభుత్వం ఆయనకు భారతరత్న పురస్కారం ఇచ్చి గౌరవించిందని రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించాలంటే రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాస్ సంతోష్, మాజీ సర్పంచ్ నరసింహ తిరుపతి, పెంచికల రాయలింగు, ఆకుల అంజి, బొజ్జ రాములు, కాపారపు రాజకుమార్, వేల్పుల సమ్మయ్య, శ్రీనివాస్, పైడిమల్ల శ్రావణ్, సందీప్, కదారి విజయ్, బొక్కల రాయలింగు, కొంతం తిరుపతి, దుర్గయ్యలు, తదితరులు పాల్గొన్నారు.

# నోట్ బుక్కుల పంపిణీ...

కమాన్ పూర్ భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 76వ జయంతిని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, పన్నూర్.2 ఎంపీటీసీ కొప్పుల గణపతి ఆధ్వర్యంలో శనివారం సెంటినరి కాలనీలోని ఉద్యానవన కళాశాల విద్యార్థిని విద్యార్థులకు నోటుబుక్కులు పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట చంద్రయ్య తన సందేశాన్ని వినిపించి గణపతిని అభినందించారు.కార్యక్రమంలో మంథని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యాల శ్రీనివాస్ కండే పోశం కాటం సత్యం వెగోళపు శ్రీనివాస్ దాసరి శివ గ్రామ శాఖ అధ్యక్షులు గాజులశ్రీనివాస్అయిందలకొమురయ్య జనగం కృష్ణఆకుల చంద్రమౌళి సోషల్ మీడియా మండల సెల్ సిద్ధం మురళి కృష్ణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరవేన అజయ్ తోడేటి శ్రీనివాస్ చింతల చంద్రయ్య తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# రైతులకు కొబ్బరి దింపడం సవాల్

యలమంచిలి కొబ్బరి కాయలు పేరు చెబితే కోనసీమ గుర్తుకువస్తుంది. తెలుగు రాష్ట్రాలకు ఇక్కడినుంచే కొబ్బరి బొండాలు, కొబ్బరి కాయలు రవాణా అవుతుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలు కొబ్బరి రైతులకు కష్టాలు తెచ్చిపెట్టాయి. లంక గ్రామాల్లో గత నెలరోజులుగా వరదలు తగ్గుముఖం పట్టలేదు. కొబ్బరి చెట్లన్నీ వరదల్లో వుండిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం లంక గ్రామాలలో వరుస వర్షాలు ఎడతెరిపి లేకపోవడంతో, కొబ్బరి చెట్లు ఎక్కి దింపుటకు అనుకూలత లేకుండా పోయింది. దీంతో దింపిన కొబ్బరి కాయల్ని ఇతర ప్రాంతాలకు రవాణా చేయడం తలకుమించిన భారంగా మారింది. రదలతో ఏర్పడిన ఇబ్బందులతో రైతులకు కొబ్బరి దింపడం సవాల్ గా మారింది. ఇటీవల వర్షాలు తగ్గాయి. కానీ రైతులకు మాత్రం ఉపశమనం లభించలేదు. గోదావరి నది భారీ వరదలతో ముంచెత్తడం వరద నీరు గత 20 రోజుల నుండి తగ్గకపోవడంతో పక్వానికి వచ్చిన కొబ్బరి కాయల్ని చెట్లు ఎక్కి తీయించడం, వాటిని బయటకు రవాణా చేయడం కష్టంగా మారింది. ఏం చేసేది లేక కొబ్బరి రైతులు బోట్లను ఆశ్రయించి వ్యయ ప్రయాసలతో కూడిన కొబ్బరి దింపడం మొదలుపెట్టారు. ఇటీవల గత 15 రోజులు ఉండి మార్కెట్ కొంత ఆశాజనకం వుంది. కాపుకి వచ్చిన కొబ్బరికాయలు దింపకపోతే తీవ్రంగా నష్టపోయే అవకాశం వుంది. అందుకే కొబ్బరి పంటను కాపాడుకోవాలని ,ఖర్చుతో కూడినా రైతులు కొబ్బరిని దింపుతున్నారు. వచ్చిన కాడికి సొమ్ము రాబట్టుకుంటున్నారు . కొబ్బరి దింపు కార్మికులకు ఒక బోటు, కొబ్బరి రవాణాకు వేరొక బోటును వినియోగిస్తూ కొబ్బరికాయల్ని గట్టుకు చేరుస్తున్నారు. వరదలో కొబ్బరి దింపడం చూసేవారికి చిత్రంగా అనిపిస్తే.. తడిసి మోపెడు అవుతున్న ఖర్చు రైతుని ఇబ్బంది పెడుతోంది. కొబ్బరి దింపుతున్న వీడియోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

# డ్రైవర్ల శిక్షణ మరియు పరిశోధన సంస్థ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయండి

## రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్



నంద్యాల/డోన్, ఆగస్టు 20:డోన్ మండలం కొత్తకోట గ్రామంలో డ్రైవింగ్ శిక్షణా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు డ్రైవర్ల శిక్షణ మరియు పరిశోధన సంస్థ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డిని ఆదేశించారు. శనివారం డోన్ మండలం కొత్తకోట గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రవాణా శాఖకు కేటాయించిన 34 ఎకరాల స్థలంలో డ్రైవింగ్ శిక్షణా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు నిర్మిస్తున్న పరిశోధనా సంస్థ పనులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణ బాబు, ఏపీ.ఎమ్.ఎస్.ఐ.డి.సి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామున్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో 18.5 కోట్లతో నిర్మించే డ్రైవర్ల శిక్షణ మరియు పరిశోధన సంస్థ పనులను వచ్చే ఏప్రిల్ మాసాంతానికి పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ఎస్ఈని ఆదేశించారు. అటవీ శాఖ అనుమతులు, వర్షాకాలం వల్ల ఆరు నెలల సమయం వృధా అయిందని... ఆలస్యం చేయకుండా చేపట్టిన నిర్మాణ పనులను నిర్ణీత కాల వ్యవధిలోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్ అండ్ బి అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ వర్క్‌షాప్ బిల్డింగ్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, హాస్టల్, వివిధ వాహనాలు డ్రైవింగ్ చేసేందుకు వీలుగా డ్రైవింగ్ ట్రాక్‌లు, ప్రహరీ గోడ, ఫెన్సింగ్ తదితర పనులు 2023 ఏప్రిల్ మాసంలోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కర్నూలు, నంద్యాల జిల్లా రవాణా అధికారులు రమేష్ నిరంజన్ రెడ్డి, డోన్ ఆర్డిఓ వెంకట్ రెడ్డి, తాసిల్దార్ విద్యాసాగర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లు కాంట్రాక్టర్ బి.శ్రీనివాసులు రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# సాంకేతిక విప్లవ సారథి రాజీవ్ గాంధీ గారు



సాంకేతిక విప్లవ సారథి స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ యం సుధాకర్ బాబు గారు కొనియాడారు. కంప్యూటర్ సాంకేతిక టెలీ కమ్యూనికేషన్ల రంగంలో ఆధునిక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో కొత్తపుంతలు తొక్కిన భారత్ ఇవాళ ఆ ఫలితాలను భారత జాతి ఆస్వాదిస్తుందంటే అప్పటి ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ గారి కృషి అని ప్రపంచమంతా కంప్యూటర్ యుగంలో దూసుకుపోతున్న వేళ మన దేశంలోనూ సాంకేతిక విప్లవం రావాలని దేశానికి మొట్టమొదటి కంప్యూటర్ ఇవ్వడమే కాకుండా ఆ రంగంలో నూతన శకానికి రాజీవ్ గాంధీ గారు శ్రీకారం చుట్టారని సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలు సమకూర్చాలని ఎంతో తపన పడ్డారని మన దేశ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలకు ఆయన చేసిన ప్రయత్నాన్ని మేధావులు సైతం ప్రశంసించారని సుధాకర్ బాబు

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు యం సుధాకర్ బాబు

గారు ఈ రోజు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి 78వ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పై విధంగా శ్రీ రాజీవ్ గాంధి గారి సేవలను కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయంలో శ్రీ రాజీవ్ గాంధీ గారి చిత్ర పటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శ్రీకాంత్ సెంటర్ నందలి శ్రీ రాజీవ్గాంధీగారి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ గారు, నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్చార్జీలు సి అశోకరత్నం, దామోదరం రాధాకృష్ణ, జిల్లా ఎబొజఅ అధ్యక్షుడు బి బతుకన్న బీసీ సెల్ చైర్మన్ లాయర్ మద్దిలేటి ఎస్సీ సెల్ ఈశ్వర్ ఐఎన్టీయూసీ సెక్రటరీ సుంకన్న ప్రభాకర్రెడ్డి సోషల్ మీడియా సిటీ ఇన్చార్జి రవికుమార్ కాంగ్రెస్ నాయకులు ఉండవెల్లి వెంకటన్న సత్యనారాయణ గుప్త సౌల్ రాజు అభినాయుడు శివానంద్ గిరి కేశవరెడ్డి దేవదాసు మహిళా కాంగ్రెస్ యస్ ప్రమీల సారమ్మ కె వెంకట లక్ష్మి మద్దమ్మ ఎల్లమ్మ మొదలగు వారు పాల్గొన్నారు .

# స్వర్గీయ విప్లవ సారథి రాజీవ్ గాంధీ ఎన్ఎస్యుఐ

### జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్

ఎమ్మిగనూరు కంప్యూటర్ సాంకేతిక టెలీ కమ్యూనికేషన్ల రంగంలో ఆధునిక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో కొత్తపుంతలు తొక్కిన భారత్ ఇవాళ ఆ ఫలితాలను భారత జాతి ఆస్వాదిస్తుందంటే అప్పటి ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ కృషి అని ప్రపంచమంతా కంప్యూటర్ యుగంలో దూసుకుపోతున్న వేళ మన దేశంలోనూ సాంకేతిక విప్లవం రావాలని దేశానికి మొట్టమొదటి కంప్యూటర్ ఇవ్వడమే కాకుండా ఆ రంగంలో నూతన శకానికి రాజీవ్ గాంధీ శ్రీకారం చుట్టారని సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలు సమకూర్చాలని ఎంతో తపన పడ్డారని మన దేశ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలకు ఆయన చేసిన ప్రయత్నాన్ని మేధావులు సైతం ప్రశంసించారని తెలిపారు. విద్య అభివృద్ధికి ప్రధానమంత్రి ఉన్న సమయంలో అనేక సేవలందించారని తెలిపారు. స్థానిక బి.సి కళాశాల వసతి గృహంలో మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ 78వ జయంతి సందర్భంగా శ్రీ రాజీవ్ గాంధి సేవలను కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయంలో శ్రీ రాజీవ్ గాంధీ గారి చిత్ర పటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శివరామకృష్ణ,మహ్మద్ రఫీ, మధుసూదన్, రాజు ,మహదేవ, రాఘవేంద్ర,తదితరులు పాల్గొన్నారు.




# ఆగస్టు 22 వ తేదీ కర్నూలు "స్పందన" కార్యక్రమం

### జిల్లా కేంద్రంలోని సునయన ఆడిటోరియంలో, డివిజన్,మండల, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజల నుండి వినతుల స్వీకరణ

### -:జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర రావు

కర్నూలు ఆగస్ట్ 20 -:ఆగస్టు 22 వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో "స్పందన" కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు×జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు




# 100 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణపు పనులను వేగవంతం చేయండి



నంద్యాల/డోన్ ఆగస్టు 20:-వంద పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణపు పనులను వేగవంతం చేసి డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సంబంధిత గుత్తేదారులను, సైట్ ఇంజనీర్లను ఆదేశించారు. శనివారం డోన్ పట్టణంలో 29 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తోన్న 100 పడకల ఆసుపత్రి భవనాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణ బాబు, ఏపీ.ఎమ్.ఎస్.ఐ.డి.సి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామున్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక

### రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ డోన్ పట్టణంలో జి+1 వంద పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణపు పనులను వేగవంతం చేసి డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్లను, సైట్ ఇంజనీర్లను ఆదేశించారు. 4.73 ఎకరాల్లో 26 కోట్ల రూపాయల అంచనాలతో యూరోపియన్ డిజైన్ తరహాలో ఆసుపత్రి భవన నిర్మాణాలు, మూడు కోట్ల రూపాయలతో ప్రహరీ గోడలు, అంతర్గత రోడ్లతో ఆసుపత్రి నిర్మాణపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. అత్యధిక ఉష్ణోగ్రతను తట్టుకునే విధంగా రూఫ్ టెక్నాలజీకి సంబంధించి ఆర్కిటెక్ట్ తో మాట్లాడి ప్రతిపాదనలు సమర్పించాలని సైట్ ఇంజనీర్ ను మంత్రి ఆదేశించారు. అలాగే 6 మీటర్ల తగ్గులోనున్న రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణ బాబు, ఏపీ.ఎమ్.ఎస్.ఐ.డి.సి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డిలు సంబంధిత కాంట్రాక్టర్లు, ఇంజనీర్లను సూచించారు. కెయంవి ప్రాజెక్ట్ లిమిటెడ్ సీనియర్ ఇంజనీర్ రాజేందర్ రెడ్డి, కాంట్రాక్టర్ మహేశ్వర్ రెడ్డి ఎపీఎమ్ఎస్ఐడిసి సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేష్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిట్ ఇంజనీర్ రాజగోపాల్ రెడ్డి, ఆర్డీవో వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యో బ్రహ్మాస్త్ర.. జక్కన్న కూడా కాపాడలేక పోతున్నాడా!

బాలీవుడ్ బిగ్గెస్ట్ మల్టీస్టారర్ క్రేజీ మూవీ బ్రహ్మాస్త్ర విడుదల తేదీ దగ్గర పడింది. సెప్టెంబర్ 9వ తారీకున ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో బ్రహ్మాస్త్ర సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు కూడా స్పీడ్ అయ్యాయి. ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో టాలీవుడ్ జక్కన్న రాజమౌళి సమర్పిస్తున్న విషయం తెల్సిందే.రణబీర్ కపూర్ హీరోగా ఆలియా భట్ హీరోయిన్ గా నటించిన ఈ సినిమాను తెలుగు లో రాజమౌళి సమర్పిస్తున్న కారణంగా కచ్చితంగా మంచి ఓపెనింగ్స్ ఉంటాయని అనిపిస్తుంది. సినిమా తప్పకుండా తెలుగు ప్రేక్షకులను చేరువ అవుతుందనే నమ్మకంను యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. కాని ఇప్పటి వరకు తెలుగు లో బ్రహ్మాస్త్ర కి మినిమంగా కూడా బజ్ క్రియేట్ అవ్వలేదు.బాలీవుడ్ స్టార్ కాస్ట్ తో పాటు నాగార్జున కీలక పాత్రలో నటించడం ఇంకా రాజమౌళి సినిమా ను సమర్పించడం వంటి కారణాలు ఎన్ని ఉన్నా కూడా సినిమాకు పాజిటివ్ బజ్ క్రియేట్ అవ్వడం లేదు. అందుకే తెలుగు రాష్ట్రాల్లో బ్రహ్మాస్త్ర కు సోలో రిలీజ్ దక్కడం లేదు. బ్రహ్మాస్త్ర కు పోటీగా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు సినిమాలు పోటీగా రాబోతున్నాయి.కిరణ్ అబ్బవరం నటించిన నేను మీకు బాగా కావాల్సిన వాడిని సినిమాను సెప్టెంబర్ 9వ తారీకున విడుదల చేయబోతున్నారు. బ్రహ్మాస్త్ర తో డైరెక్ట్ ఢీ కిరణ్ అబ్బవరం రెడీ అయ్యాడు. ఆ సినిమా మాత్రమే కాకుండా గుర్తుందా శీతాకాలం సినిమా తో సత్యదేవ్ మరియు తమన్నాలు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నారు.ఆ రెండు సినిమాలు కాదు అన్నట్లుగా శర్వానంద్ కీలక పాత్రలో నటించిన 'ఒకే ఒక జీవితం' సినిమాను కూడా అదే తేదీన విడుదల చేయబోతున్నారు. భారీ అంచనాల నడుమ రూపొందిన బ్రహ్మాస్త్ర సినిమా తెలుగు లో పాజిటివ్ బజ్ క్రియేట్ చేయడం లో విఫలం అయ్యింది.అందుకే చిన్న సినిమాలు ఆ సినిమా విడుదల అవ్వబోతున్న రోజునే విడుదలకు సిద్ధం అయ్యాయి. ఆ చిన్న సినిమాల ముందు బ్రహ్మాస్త్ర నిలుస్తుందా.. లేదంటే బ్రహ్మాస్త్ర ముందు అవి కనిపించకుండా పోతాయా అనేది కాలమే నిర్ణయించాలి.




# 'కార్తికేయ 2'కి కలిసొచ్చిన శ్రీకృష్ణ జన్మాష్టమి!

నిఖిల్ - చందూ మొండేటి కాంబినేషన్లో రూపొందిన 'కార్తికేయ 2' ఈ నెల 13వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించిన ఈ సినిమాకి కాలభైరవ సంగీతాన్ని సమకూర్చాడు. తెలుగు రాష్ట్రాలతో పాటు బాలీవుడ్ లోను ఈ సినిమా దూసుకుపోతోంది. 3 రోజుల్లోనే అక్కడ ఈ సినిమాకి 700 థియేటర్లు దక్కడం విశేషం. ఇక్కడ కూడా ఈ సినిమాకి థియేటర్ల సంఖ్య పెరుగుతూ వెళుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీమ్ ను బిత్తిరిసత్తి ఇంటర్వ్యూ చేశాడు.నిఖిల్ మాట్లాడుతూ .. ఈ సినిమాకి వస్తున్న విశేషమైన స్పందన చూస్తుంటే ఎంతో ఆనందం కలుగుతోంది. ఒక చోట టిక్కెట్లు దొరక్కపోతే మరో చోటుకి వెళ్లి మరీ జనాలు ఈ సినిమాను చూస్తున్నారు. రేపు 'శ్రీకృష్ణ జన్మాష్టమి' కావడం వలన బాలీవుడ్ లో ఈ సినిమాకి మరిన్ని థియేటర్లు ఇస్తున్నట్టుగా తెలుస్తోంది.ఇది కృష్ణుడికి సంబంధించిన సినిమా కావడం వలన ఆ రోజున భారీ వసూళ్లను రాబట్టడం ఖాయమనే అంచనాలు ఉన్నాయి. ఇక్కడ కూడా ఆ రోజున థియేటర్ల దగ్గర సందడి పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మా సినిమాకి 'శ్రీకృష్ణ జన్మాష్టమి' కలిసి రావడం కూడా ఆ స్వామి నిర్ణయమే.ఈ సినిమాలో యాక్షన్ .. ఎమోషన్ .. కామెడీ ఉన్నాయి. భక్తి అనేది కూడా ఈ సినిమాలో ఒక భాగంగా కనిపిస్తుంది.ఇక ఈ సినిమాకి మూడో భాగం కూడా ఉంది. ఆ విషయాన్ని మనం చివరలో చూపించాం కూడా.అట్లాంటిక్ సముద్రం నేపథ్యంలో ఆ కథ నడుస్తుంది. 3వ భాగంలో కూడా అనుపమనే ఉంటుంది. కార్తికేయ కథను ఇటు సైన్స్ .. అటు దైవత్వం అనే రెండు కోణాల్లో ఆవిష్కరించడం ఆడియన్స్ కి కొత్తగా అనిపించింది. కొత్తగా మేము చేసిన ఆ ప్రయత్నమే ఈ రోజున ఈ సినిమా ఈ స్థాయిలో విజయవంతం కావడానికి కారణమైంది.ఈ సినిమాలో మునులు .. రుషులకు మించిన సైంటిస్ట్ లు ఎవరున్నారు అనే ఒక డైలాగ్ ఉంది. ఈ సినిమా కోసం జరిపిన అన్వేషణలో మాకు అదే అనిపించింది. దానినే సినిమాలో పెట్టాము. ద్వారకలో ఐదువేల ఏళ్ల క్రితం కృష్ణుడి మనవడు ఆయనకి కట్టిన గుడి చూసి మేము ఆశ్చర్యపోయాము. ద్వారకలో ఇలాంటి ఎన్నో అద్భుతాలు ఉన్నాయి. వాటిని సినిమాటిక్ గా తెరపై చూపించడానికి మేము ట్రై చేశాము. ఈ సినిమా హిట్ అవుతుందని అనుకున్నాముగానీ ఈ స్థాయిలో జనంలోకి వెళుతుందని మాత్రం ఊహించలేదు" అంటూ చెప్పుకొచ్చాడు.




# జింతాక్ : రవితేజ - శ్రీలీల ఊర మాస్ అంతే!

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్ టైనర్ 'ధమాకా'. త్రినాథరావు నక్కిన తెరకెక్కిస్తున్నారు. 'డబుల్ ఇంపాక్ట్' అని ట్యాగ్ లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్ లపై టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇంత వరకు తనదైన మార్కు కామెడీని మిక్స్ చేస్తూ లవ్ స్టోరీలని అందించిన త్రినాథరావు నక్కిన తొలి సారి తన జానర్ కు పూర్తి భిన్నంగా ఎంటర్ టైన్ మెంట్ ని జోడించి తెరకెక్కిన యాక్షన్ ఎంటర్ టైనర్ ఇది.దీంతో ఈ మూవీపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి మొదలైంది. ఫస్ట్ లుక్ పోస్టర్ నుంచి ఎంటర్ టైన్ మెంట్ గ్యారెంటీ అనే సంకేలాల్ని అందిస్తూ వస్తున్న ఈ మూవీ రవితేజ శ్రీలీల ఫస్ట్ సాంగ్ 'జింతాక్..' పోస్టర్ తో మరింత ఆసక్తిని రేకెత్తించడం మొదలు పెట్టింది. సినిమా రిలీజ్ కు టైమ్ వున్న నేపథ్యంలో మేకర్స్ లిరికల్ సాంగ్స్ తో ప్రమోషన్స్ కి తెర లేపారు.మాస్ మహారాజా రవితేజ శ్రీలీలపై చిత్రీకరించిన 'ఎంకన్న తీర్థంలో యూల పొద్దు మూహూర్తంలో..పూల జెడ ఎత్తుతుంటే.. పుస్తె నువ్వు కడుతుంటే..ఏ కన్నూ సూడకుండా..కన్ను నాకు కొడుతుంటే..నిన్ను చూడబుద్ధైతాంది రాజిగో..మాటాడబుద్ధైతాంది రాజిగో..జింతాక...జింతాక..' అంటూ సాగే లిరికల్ వీడియోని మేకర్స్ గురువారం విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ పాటకు సాహిత్యాన్ని కాసర్ల శ్యామ్ అందించారు.శేఖర్ వీజే డ్యాన్స్ కంపోజ్ చేసిన ఈ పాటని భీమ్స్ సిసిరోలియో మంగ్లీ ఆలపించారు. 'రాములో రాములా..' అంటూ జానపద గీతాన్ని ఊర మాస్ సాంగ్ గా ప్రజెంట్ చేసిన అదరగొట్టిన కాసర్ల శ్యామ్ అదే పంథాలో 'ధమాకా' కోసం 'జింతాక్..' సాంగ్ ని అందించడం విశేషం. ఊర మాస్ నంబర్ గా ట్యూన్ చేసిన ఈ సాంగ్కు అదే స్థాయిలో మాస్ స్టెప్పులతో మాస్ మహారాజా రవితేజ హీరోయిన్ శ్రీలీల అదరగొట్టేశారు. భీమ్స్ అందించిన మాస్ బీట్ లకు రవితేజతో కలిసి మాస్ స్టెప్పులేస్తూ శ్రీలీల పోటీపడిన తీరు ఆకట్టుకుంటోంది.థియేటర్లలో ఈ పాట ప్రేక్షకుల్ని ఓ ఊపు ఊపేయడం ఖాయం. ఈ పాటలో రవితేజ శ్రీలీల ల కెమిస్ట్రీ కూడా అదరింఇది. ఇద్దరి గ్రేస్ ఫుల్ డ్యాన్స్ కి ఫ్యాన్స్ ఆడియన్స్ ఫిదా కావడం గ్యారంటీ. సాధారణంగా మాస్ బీట్ సాంగ్స్ ని సెట్ లలో లోకల్ లొకేషన్ లలో షూట్ చేస్తారు. కానీ ఈ పాటని విదేశీ డ్యాన్సర్స్ మధ్య విదేశీ లొకేషన్స్ లో చిత్రీకరించడం విశేషం.సాంగ్ లొకేషన్స్ కూడా పాటకు తగ్గట్టుగా బాగా కుదిరాయి. దీంతో సాంగ్ చాలా కలర్ ఫుల్ గా కనిపిస్తోంది. కార్తీక్ ఘట్టమనేని అందించిన ఫొటోగ్రఫీ భీమ్స్ సంగీతం ఈ పాటకు ప్రధాన హైలైట్స్ గా నిలవనున్నాయి.




# టీమిండియా సీనియర్ పేసర్ రీఎంట్రీ.. లార్డ్స్‌లో ఫేర్‌వెల్ మ్యాచ్!




ఇంగ్లండ్ గడ్డపై మూడు టి20లు, 3 వన్డేల్లో తలపడే భారత మహిళల జట్టును సెలక్టర్లు గురువారం ప్రకటించారు. గత శ్రీలంక సిరీస్‌కు దూరంగా ఉండి రిటైర్మెంట్‌పై అనుమానాలు పెంచిన సీనియర్ పేసర్ జులన్ గోస్వామి ఇప్పుడు జట్టులోకి పునరాగమనం చేయడం విశేషం. అయితే ఇదే సిరీస్‌లో సెప్టెంబర్ 24న లార్డ్స్ వేదికగా జరగనున్న మూడో వన్డే ఆమెకు ఆఖరి మ్యాచ్ కానుందనే వార్తలు వస్తున్నాయి. ఈ మేరకు బీసీసీఐ ప్లాన్‌లో భాగంగానే ఝులన్ గోస్వామికి వీడ్కోలు మ్యాచ్ నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలిసింది.ఇక 39 ఏళ్ల ఝులన్ గోస్వామి 2018లో టి20 క్రికెట్ నుంచి తప్పుకొని కేవలం వన్డేలకు పరిమితమైంది. మహిళా క్రికెట్‌లో వన్డే ఫార్మాట్‌లో 200, 250 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా ఝులన్ గోస్వామి చరిత్ర సృష్టించింది. 2007లో ఐసీసీ వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైన ఝులన్ గోస్వామి 2008 నుంచి 2011 వరకు టీమిండియా మహిళా జట్టుకు నాయకత్వం వహించింది. ఇక ఝులన్ గోస్వామి టీమిండియా తరపున 12 టెస్టుల్లో 291 పరుగులు.. 44 వికెట్లు, 199 వన్డేల్లో 1226 పరుగులు.. 250 వికెట్లు.. 68 టి20ల్లో 405 పరుగులు.. 56 వికెట్లు పడగొట్టింది.ఇక ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ఏడాది తర్వాత వన్డే టీమ్‌లో జెమిమా రోడ్రిగ్స్‌కు చోటు దక్కగా, దేశవాళీ క్రికెట్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లతో సత్తా చాటిన నాగాలాండ్ బ్యాటర్ కిరణ్ ప్రభు నవ్‌గిరేకు తొలిసారి భారత టి20 జట్టులో చోటు లభించింది. రెండేళ్ల తర్వాత హేమలత మళ్లీ వన్డే టీమ్‌కు ఎంపిక కాగా, లెగ్‌స్పిన్నర్ పూనమ్ యాదవ్‌కు రెండు టీమ్‌లలోనూ స్థానం లభించలేదు. ఆంధ్ర క్రికెటర్ సబ్బినేని మేఘన వన్డే, టి20 టీమ్‌లలోనూ అవకాశం దక్కించుకోగలిగింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190